

పేదల చదువుపై పెద్దలకేదీ శ్రద్ధ

- నలుగురు ముఖ్యమంత్రులు మారినా..
- ట్రిపుల్‌ఐటీలలో రెగ్యులర్ అధ్యాపకుల భర్తీ లేదు
- ఉన్న అధ్యాపకులకు అదనపు బాధ్యతలు
- కుంటుపడుతున్న విద్యాబోధన
- ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌తో అయినా భర్తీ జరిగేనా ?


వేంపల్లె, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు కూడా ఉన్నత విద్యావకాశాలను అందించాలన్న సంకల్పంతో రాష్ట్రంలో ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో ట్రిపుల్‌ఐటీలు ఏర్పాటయ్యాయి. వీటిలో ప్రపంచస్థాయి అత్యుత్తమ విద్యాప్రమాణాలు ఉంటాయని అధికారులు తరచూ చెబుతూ ఉంటారు. కానీ ఆ స్థాయిలో విద్యాబోధన జరగడం లేదు. అందుకే ఆశించిన స్థాయి ఫలితాలు రావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇందుకు ప్రధాన కారణం అక్కడ అధ్యాపకుల కొరత ఉండడమే. మరీ ముఖ్యంగా రెగ్యులర్ అధ్యాపకులు లేక ఉన్న కాంట్రాక్టు, తాత్కాలిక అధ్యాపకులతోనే విద్యాబోధన సాగిస్తుండడం.. ఉన్న ఆ అధ్యాపకులకు పరిపాలనకు సంబంధించి అదనపు బాధ్యతలు ఇవ్వడంతో విద్యాబోధన మొక్కుబడిగా సాగుతోంది. నలుగురు ముఖ్యమంత్రులు మారారు. అయిన రెగ్యులర్ పోస్టుల భర్తీ జరగలేదు. అధ్యాపకుల కొరత తీరలేదు.

అధ్యాపకుల కొరత..

రాష్ట్రంలో రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇడుపులపాయ, నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్‌ఐటీలు కొనసాగుతున్నాయి. ఒక్కో ట్రిపుల్‌ఐటీలో ఆరువేల మంది చొప్పున నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో 24వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆర్జీయూకేటీ నిబంధనల ప్రకారం 15 మంది విద్యార్థులకు ఒకరు చొప్పున 1,600 మంది అధ్యాపకులు ఉండాలి. కానీ ప్రస్తుతం నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో కలిపి అన్ని రకాలు కలిపి 450 మంది మాత్రమే అధ్యాపకులు ఉన్నారు. దీన్ని బట్టి ట్రిపుల్‌ఐటీల్లో అధ్యాపకుల కొరత ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. 30 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు కావాలన్నా కనీసం 800 మంది అవసరం. దీనికి తోడు ఉన్న అధ్యాపకుల్లో పరిపాలన పరమైన అదనపు బాధ్యతలు అప్పగిస్తుండడంతో విద్యాబోధన మరింత కుంటుపడుతోంది. ఉదాహరణకు ఆరు నెలల్లో చెప్పాల్సిన సిలబస్‌ను నెల లోపే చెప్పే పరిస్థితులు ఉన్నాయని, దీనితో తూతూమంత్రంగా బోధన సాగుతోందని, పలువురు విద్యార్థులు తమ గోడు వెళ్లబోస్తున్నారు. అదనపు బాధ్యతలపై ఎక్కువ మక్కువ చూపుతూ విద్యాబోధనను ఒకింత నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

17 ఏళ్లుగా రెగ్యులర్ పోస్టుల భర్తీ లేదు

ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో 2008లో ట్రిపుల్‌ఐటీలను ప్రారంభించారు. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నోటిఫికేషన్ ఇచ్చి 100 మందిని రెగ్యులర్ అధ్యాపకులుగా తీసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 17ఏళ్ల కాలంలో ఒక్కసారి కూడా రెగ్యులర్ పోస్టులను భర్తీ చేసింది లేదు. తర్వాత నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, రోశయ్య, చంద్రబాబునాయుడు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రులు అయ్యారు. కానీ ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ట్రిపుల్‌ఐటీలో అధ్యాపకుల రెగ్యులర్ పోస్టుల భర్తీ జరగలేదు. వైఎస్ జగన్ హయాంలో ఎన్నికలు దగ్గరకు వస్తున్నాయనగా చాన్సలర్‌గా ఉన్న కేసీరెడ్డి నోటిఫికేషన్ ఇచ్చారు. 660 అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలని నోఫికేషన్ ఇవ్వగా దీనిపై కోర్టుల్లో కేసులు వేయడంతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ప్రస్తుతం మళ్లీ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యారు. ఈ ప్రభుత్వంలోనైనా ట్రిపుల్‌ఐటీల్లో అధ్యాపకుల కొరత తీరుతుందేమోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల ట్రిపుల్ ఐటీలపై మంత్రి నారాలోకేశ్ ప్రత్యేక దృష్టి పెట్టారని, కోర్టులో ఉన్న కేసులను తొలగింపజేసి తప్పకుండా నోటిఫికేషన్ ద్వారా ట్రిపుల్‌ఐటీల్లో రెగ్యులర్ అధ్యాపకులను నియమించుకుందామని హామీ ఇచ్చారని వైస్ చాన్సరల్ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ ప్రభుత్వంలో అయినా రెగ్యులర్ అధ్యాపకుల భర్తీ జరగాలని అధ్యాపకులు, విద్యార్థులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ముఖ ద్వారం

పట్టుదలతో ఉన్నాం



ఆర్జీయూకేటీలోని ట్రిపుల్ ఐటీల్లో రెగ్యులర్ పోస్టులు భర్తీ చేయాలనే పట్టుదలతో ఉన్నాం. వీసీ కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నాం. ఇప్పటికే ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. త్వరగా నోటిఫికేషన్ వచ్చి పోస్టులు భర్తీ కావాలని ఆశిస్తున్నాం.

- అమరేంద్రకుమార్ సండ్ర, రిజిస్ట్రార్, ట్రిపుల్‌ఐటీ



దక్షిణకాశీగా పేరుగాంచిన రాయచోటిలోని వీరభద్రాలయం

వీరభద్రుడి మూలవిరాట్

ప్రళయకాల రుద్రుడు.. వీరభద్రుడు...

- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
- రేపు కల్యాణోత్సవం
- మార్చి 2న మహానైవేద్య ఘట్టం... రథోత్సవం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రళయకాల రుద్రుడు... కన్నడ భక్తుల ఆరాధ్యుడు.. దక్షిణకాశీగా పేరుగాంచిన రాయచోటి వీరభద్రుడి బ్రహ్మోత్సవాలు ఈనెల 23 నుంచి మార్చి 5వ తేదీ వరకు ఘనంగా జరగనున్నాయి. రాయచోటి పట్టణంలోని మాండవ్యనది ఒడ్డున వెలిసి ఉన్న ప్రళయకాల రుద్రుడు రాయచోటి వీరభద్రుడు మహాశివుడి జటాజూటం నుంచి ఉద్భవించి శివుడి ఆదేశానుసారం రాయచోటి సమీపంలోని మాండవ్యనది ఒడ్డున కొలువుతీరారని ఇతిహాసం ద్వారా తెలుస్తోంది. వీరభద్రాలయంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. వీరశైవ ఆగమ ఆచారం ప్రకారం జరిగే బ్రహ్మోత్సవాలను ఆలయ ప్రధాన అర్చకులు శంక రయ్య, కృష్ణయ్య స్వాముల ఆధ్వర్యంలో జరగనున్నాయి. వీరభద్రాలయంలో ఈనెల 23 నుంచి మార్చి 5వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈనెల 23న తెల్లవారుజాము 5 గంటలకు యాగశాల ప్రవేశంతో మహాగణపతి పూజ, ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 24వ తేదీ రాత్రి 9 గంటలకు కల్యాణోత్సవం, మార్చి 2వ తేదీ తెల్లవారుజాము 4.30 గంటలకు అగ్నిగుండ ప్రవేశం, రుద్ర హోమం, ఉదయం 11.45 గంటలకు వైభవంగా స్వామి వారికి మహానైవేద్యం జరగనుంది. సాయంత్రం 4 గంటలకు రథోత్సవం జరగనుంది. 5వ తేదీ ఏకాంతసేవతో ఉత్సవాలు ముగుస్తాయి. బ్రహ్మోత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి తెలిపారు.

ప్రాజెక్టుల కోసం ఉద్యమం తప్పదు

- ఏపీ రైతు సంఘం నేతలు


ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభలో మాట్లాడుతున్న దశరథరామిరెడ్డి

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారుతున్నా ప్రాజెక్టులు పూర్తికాక రైతులు ఇతర రాష్ట్రాలకు వలసపోయే పరిస్థితి దశాబ్దాలుగా కొనసాగుతోందని ఇలాగే కొనసాగితే ప్రాజెక్టుల సాధనకోసం మరో ఉద్యమం చేయక తప్పదని ఏపీ రైతు సంఘం నేతలు పేర్కొన్నారు. శనివారం సీపీఐ ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి గ్రామానికి తాగునీటి సాధనకై రాయలసీమతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభను కడప నగరంలోని హరిత హోటల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులపై నిష్ణాతులైన వివిధ రంగాలకు చెందిన వారు ప్రసంగించారు. ప్రాజెక్టుల ప్రస్తుత తీరుతెన్నులు, కొత్త ప్రాజెక్టుల నిర్మాణాలకు తీసుకోవాల్సిన విధులు, నిధులపై సభలో సమగ్రంగా చర్చించారు.

నీటిపారుదల ప్రాజెక్టు నిపుణులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దశాబ్దాలుగా ప్రాజెక్టుల కోసం నిధులు కేటాయించి శంకుస్థాపనలు చేసి పూర్తిచేయడానికి మాత్రం ఏ ప్రభుత్వమూ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో గ్రేటర్ రాయలసీమ ప్రాజెక్టులను, వాటిలోని నీటిని పంపిణీ చేయడానికి అనుసంధానంగా ఉండే చిన్న కాల్వలను పూర్తి చేయడానికి బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తులసిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రాజెక్టులు అనాదిగా వివక్షకు గురవుతున్నాయన్నారు. ప్రాజెక్టులు పూర్తయితే సాగు, తాగునీరు, విద్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. రాయలసీమ ప్రాజెక్టుల ఉద్యమకారుడు దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమలో ప్రాజెక్టుల హక్కులు కాపాడుకోవడంలో ఏపీలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ముందడుగు వేయలేకపోయాయని విచారం వ్యక్తం చేశారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు రామాంజనేయులు మాట్లాడుతూ రాయలసీమలో కరువు రక్కసికి బలైన చిన్న సన్నకారు రైతులతో పాటు దినసరి కూలీలు కూడా ఉపాధి లేక పక్కనున్న కర్ణాటక, మహారాష్ట్రకు వలస పోయి మరీ దుర్భరంగా భిక్షమెత్తుకునే పరిస్థితులు రాష్ట్ర పాలకులు కల్పించారన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రాజెక్టుల కోసం చేసిందేమీ లేదన్నారు. ప్రాజెక్టుల సాధన కోసం ముఖ్యమంత్రితో నిత్యం చర్చిస్తున్నామని వెల్లడించారు. రైతు సంఘం జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య, ఏపీ రైతు సంఘం నాయకులు రామచంద్రయ్య మాట్లాడుతూ రాయలసీమలోనే కాకుండా దేశం యావత్తు ప్రాజెక్టుల సమస్యలు దేశాన్ని పట్టిపీడిస్తున్నాయని వీటికి పాలకులు నిధులు కేటాయించి పరిష్కార మార్గాలు చూపాలన్నారు.

ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి



ఆర్‌ఎంపీల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఉమామహేశ్వర కుమార్

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని అలా కాదని వైద్య ఆరోగ్య శాఖ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్ హెచ్చరించారు. శనివారం ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో జమ్మలమడుగు డివిజన్ పరిధిలోని ఆర్‌ఎంపీలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ రిజిష్టర్ చేసుకున్న గైనకాలజిస్టులు మాత్రమే తప్పని పరిస్థితుల్లో అబార్షన్ చేయాలన్నారు. ఎవరైనా స్కానింగ్ చేయించుకుని ఆడపిల్ల అని తెలిశాక వచ్చిన వారికి అబార్షన్ చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే బోర్డు పెట్టుకోవాలన్నారు. క్లినిక్ అని, డాక్టర్ అని బోర్డుపై ఉండరాదన్నారు. ప్రభుత్వ నియమాలు ఉల్లంఘించి పరిధి దాటి వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రమణమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, లీగల్ కన్సల్‌టెంట్ పాలేశ్వర రావు, ఆర్‌ఎంపీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి శివకుమార్, డివిజన్ అధ్యక్షుడు నౌషద్, కార్యదర్శి రంగయ్య పాల్గొన్నారు.

నీటి పథకాల పనితీరు మెరుగుపడాలి

- జడ్పీ సీఈవో ఓబులమ్మ


సీపీడబ్ల్యూఎస్ స్కీం పనితీరు గురించి అడుగుతున్న జడ్పీ సీఈవో ఓబులమ్మ

కడప రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నీటి పథకాల పనితీరును మరింతగా మెరుగు పరిచి ప్రజలకు అవసరమైన తాగునీటిని సరఫరా చేయాలని జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. శనివారం కమలాపురం నియోజకవర్గంలోని కమలాపురం, పెండ్లిమర్రి, వల్లూరు ప్రాంతాల్లో ఉన్న సీపీడబ్ల్యూఎస్ స్కీంలను పరిశీలించారు. వీటి నిర్వహణ, పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీపీడబ్ల్యూఎస్ స్కీంల నిర్వహణకు ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ఇవి ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయన్నారు. సీపీడబ్ల్యూఎస్ స్కీం పరిధిలోని ప్రతి గ్రామానికి తాగునీరు సరఫరా కావాలన్నారు. ఇందులో అధికారులు, కాంట్రాక్టర్లు అలసత్వం వహించరాదన్నారు.

ఉద్యోగుల ఆరోగ్యమే ధ్యేయం

- ఆర్టీసీ ఏరియా హాస్పిటల్ ప్రధాన వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి



కడప మారుతీనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ పురోగతికి కారకులైన ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా సేవలందిస్తున్నామని ఆర్టీసీ ఏరియా హాస్పిటల్ ప్రధాన వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన ఆంధ్రజ్యోతి అడిగిన పలు ప్రశ్నలకు ఫటాఫట్ సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: ఆర్టీసీ ఏరియా ఆసుపత్రిలో ఎలాంటి వైద్యసేవలు ఉన్నాయి
జవాబు: ఇక్కడ జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, కంటి వైద్యం, ఆర్థోపెడిక్, ఆప్తాల్మిక్ వైద్యసేవలు అందిస్తున్నాం. అలాగే సాధారణ జ్వరాలు, జలుబు, దగ్గు తదితర వైరల్ ఫీవర్లకు చికిత్స చేస్తున్నాం.

ప్రశ్న: ఎంత మంది వైద్యులు ఉన్నారు
జవాబు: ఏడుగురు వైద్యులు ఉన్నారు. ఇందులో ముగ్గురు స్పెషలిస్టులు. మిగతా నలుగురు ఎంబీబీఎస్ వైద్యులు. ఆసుపత్రిలో 20 పడకలున్నాయి. ఐదు క్యాజువాలిటీలలో వైద్యసేవలు అందిస్తున్నాం. మేజర్, ఆల్‌టెస్ట్ ల్యాబ్‌లు, ఎక్స్‌రే యూనిట్, ఆపరేషన్ థియేటరు, ఫార్మశీ ఉన్నాయి.

ప్రశ్న: ఏయే జిల్లాల వారు వస్తారు
జవాబు: అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి వస్తారు. రోజుకు సుమారు 250 నుంచి 300 మంది వరకు వస్తారు. వీరిలో ఎక్కువగా కడప, అన్నమయ్య జిల్లాల వారే ఉంటారు.

ప్రశ్న: ఓపీ టైమింగ్స్ ఎలా
జవాబు: ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు ఓపీ ఉంటుంది. ఓపీ సమయంతో సంబంధం లేకుండా ఎమర్జెన్సీ కేసులు 24 గంటలూ చూస్తాము.

ప్రశ్న: ఉద్యోగులకు మీరిచ్చే సలహా ఏంటి
జవాబు: ప్రస్తుతం ఎండలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగులు విధుల నిర్వహణ సమయంలో మంచినీరు, కొబ్బరినీరు, మజ్జిగ, ద్రవ పదార్థాలు అధికంగా తీసుకుంటూ ఆరోగ్యం కాపాడుకోవాలి.

ప్రశ్న: ఎండాకాలంలో ఎలాంటి ఆహారం తీసుకోవాలి
జవాబు: ఆర్టీసీ ఉద్యోగులు వేసవి తాపానికి తట్టుకునేలా మితాహారం తీసుకోవాలి. ఆకుకూరలతో కూడిన భోజనం, పండ్లు, ద్రవ పదార్థాలు ఆహారంలో భాగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సి ఉంది.

ఫటాఫట్

కూలీలకు ‘ఉపాధి’

- ఆదుకుంటున్న ఉపాధిహామీ పనులు
- 80లక్షల పనిదినాలు టార్గెట్
- ఇప్పటికే 69,96,207 పనిదినాల కల్పన
- క్రమంగా పెరుగుతున్న కూలీల సంఖ్య
- రోజూ 24వేల మంది పనులకు


ఉపాధి హామీలో భాగంగా మైదుకూరు మండలం అన్నలూరులో కాల్వ పనులు చేస్తున్న కూలీలు

(కడప-ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం వ్యవసాయ కూలీలకు ఆసరాగా నిలుస్తోంది. కరువు కారణంగా వ్యవసాయ పనులు లేక ఖాళీగా ఉంటున్న కూలీలకు ఇదొక భరోసా కల్పిస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 80లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉండగా శనివారం నాటికి 69,96,207 పనిదినాలు కల్పించారు. కూలీల రూపంలో రూ.180 కోట్లు ఖర్చు పెట్టారు. వచ్చే నెల చివరికి ఆర్థిక సంవత్సరం పూర్తికానుంది. ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు లక్ష్యం మేర కూలీలకు పనులు కల్పించనున్నారు.

జిల్లాలో జాబ్‌కార్డులు ఇలా..

- మొత్తం జాబ్‌కార్డులు 22,46,465
- జాబ్‌కార్డులో ఉన్న కూలీల సంఖ్య 4,09,897
- యాక్టివేట్ జాబ్‌కార్డులు 1,92,189
- వాటిలో ఉన్న కూలీల సంఖ్య 3,25,420
- 2024-25 ఆర్థిక సంవత్సరంలో పనులకు వచ్చిన కుటుంబాలు 1,45,829
- శనివారం నాటికి వచ్చిన కూలీలు 2,31,098
- పనిదినాల లక్ష్యం 80 లక్షలు
- శనివారం నాటికి 68,96,207
- శాతం 86.20 శాతం
- 2024-25లో బడ్జెట్ కేటాయింపు రూ.337.95 కోట్లు
- కూలీలకు ఇప్పటి వరకు ఖర్చు చేసింది రూ.178.05 కోట్లు
- మెటీరియల్ కోసం ఖర్చు రూ.140.08 కోట్లు
- పరిపాలన ఖర్చు రూ.19.82 కోట్లు

కూలీలకు ఆసరా

వ్యవసాయ పనులు లేనప్పుడు కూలీలకు ఉపాధి హామీ పనులే ఆసరాగా ఉంటున్నాయి. కూలీలే కాదు చిన్న సన్న కారు రైతులు కూడా ఉపాధి పనులకు వెళుతున్నారు. రోజువారి కూలి రూ.300 ఇవ్వాల్సి ఉంది. అయితే ప్రస్తుతం జిల్లాలో సగటున రూ.260.22 కూలి దక్కుతోంది. 6 నుంచి 7గంటలు పనిచేస్తే రూ.300 వస్తుంది. ఎండలు ఎక్కువగా ఉండడంతో అన్ని గంటల పాటు పనులు చేయలేక పోతున్నారు. దీంతో చేసిన మేరకే కూలీ పడుతుంది.


ఇవీ జరుగుతున్న పనులు

ప్రస్తుతం ఉపాధి హామీ ద్వారా కాల్వల్లో పూడిక తీత, ఫారంపాండ్స్, ఇతర నీటి సంరక్షణ పనులు చేపడుతున్నారు. వర్షం చుక్కను ఒడిసిపట్టే లక్ష్యంతో రైతుల పొలాల్లో ఫారంపాండ్స్ తవ్వించాలని ఇప్పుడు ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలో గ్రామ పంచాయతీకి పది చొప్పున 5,620 ఫారంపాండ్స్ తవ్వాలని టార్గెట్ పెట్టుకున్నారు. ఇప్పటికే 96 పూర్తి చేశారు. పొలాల్లో ఓ చివరన ఫారంపాండ్ నిర్మిస్తే వర్షాకాలంలో అందులో నీరు చేరి ఆ భూమిలో తేమశాతం ఎక్కువగా ఉంటుంది. దీంతో అక్కడున్న పండ్లతోటలు, ఇతర పంటలు ఎండిపోవు. అలాగే పొలం గట్టు చుట్టు పండ్లతోటలు, ఇతర జాతుల మొక్కలు సాగు చేసుకుంటే రైతుకు అదనపు ఆదాయం వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఫారంపాండ్స్‌ను మార్చి నెల చివరి నాటికి పూర్తి చేసేలా టార్గెట్ పెట్టుకున్నారు.

ముమ్మరంగా పనులు..

జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా కాల్వల్లో పూడికతీత ఇతర పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఉపాధి నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో సీసీరోడ్లు, డ్రైన్స్ చేపడుతున్నారు. ఇక జిల్లాలో ఉపాధి పనులకు వచ్చే వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. వారం రోజులుగా పరిశీలిస్తే రోజూ 22వేల నుంచి 24వేల మధ్య కూలీలు పనులకు వస్తున్నారు. ఇంకా జిల్లాలో జమ్మలమడుగు, పులివెందుల, ప్రొద్దుటూరు, మైదుకూరు ప్రాంతాల్లో వరి, మొక్కజొన్న, శెనగ పంట కోత దశలో ఉన్నాయి. ఈ వారంలో కోతలు పూర్తవుతాయి. తర్వాత కూలీల సంఖ్య మరింత పెరగనుంది. మార్చి నుంచి రోజూ 50వేల మంది పనులకు వస్తారని అంచనా వేస్తున్నారు.

లక్ష్యం పూర్తి చేస్తాం



జిల్లాలో ఉపాధిహామీ పనిదినాలను పూర్తిగా సద్వినియోగం చేసుకుని వంద శాతం లక్ష్యం పూర్తి చేస్తాం. ఇప్పటి వరకు వంద రోజుల పనిదినాలను 6,641 కుటుంబాలకు కల్పించాం. 81.99 శాతం పనిదినాలు 17,597 కుటుంబాలు, 71 నుంచి 80 శాతం మధ్య 10,333 కుటుంబాలు, 61 నుంచి 71 మధ్య 11,806 కుటుంబాలకు పని దినాలు కల్పించాం.

- బి.ఆదిశేషారెడ్డి, డ్వామా పీడీ

రోజువారి హాజరు

తేదీ	సంఖ్య
17	22,402
18	23,556
19	23,305
20	23,781
21	24,138
22	23,142



- ఆవులు మాంసం తినే అరుదైన క్షేత్రం
- బండెన్న, అక్కదేవతలు కొలువైన ఆలయం
- బండెన్న దర్శనం ఆడవాళ్లకు నిషేధం
- శివరాత్రికి మూడు రోజుల వేడుక

పాలకొండల్లో మల్లికార్జునుడు

ఆవు శాఖాహారి.
పాలతల బండెన్న గుడి పరిసరాల్లో మాత్రం ఆవు మాంసాహారి. ఈ వింత చూడాలంటే.. పెండ్లిమర్రి మండలం గంగనపల్లె పంచాయతీ పరిధిలోని పాలతల మల్లేశ్వరస్వామి ఆలయం సందర్శించాలి. కడప నుంచి 25 కిలోమీటర్లు ప్రయాణిస్తే శేషాచలం సానువుల్లో భాగమైన పాలకొండల్లోని ఈ గుడికి చేరుకోవచ్చు. మహాశివరాత్రికి మూడు రోజులపాటు వైభవంగా వేడుకలు జరిగే ఆలయం ఇది. ప్రకృతి అందాల నడుమ వెలసిన ఈ ఆలయ సందర్శన గొప్ప అనుభూతిని ఇస్తుంది.

- పెండ్లిమర్రి, ఆంధ్రజ్యోతి



పశువులకు మేతగా మాంసం

వేట నరికి వండిన మాంసం మిగిలితే తీసుకువెళ్లరాదని నమ్మకం. దీంతో అక్కడే వదిలేస్తారు. ఇక్కడ తిరుగులాడే ఆవులు, ఎద్దులు ఈ మాంసాన్ని తినడం అలవాటు చేసుకున్నాయి. ఈ అలవాటే బండెన్న ఆలయ ప్రాంగణంలోని 200 పశువులను మాంసాహారులుగా మార్చేశాయి.

అక్కదేవతల సమక్షం



ఈ ప్రాంగణంలో పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి ఆలయం, పులి బండెన్న, పుట్ట ఆంజనేయస్వామి, వినాయకుడు, సుబ్రమణ్యస్వామి, కాశిరెడ్డి నాయనలను దర్శించుకోవచ్చు. ఈ క్షేత్రంలో అన్న బండెన్న సహా ఏడుగురు అక్కదేవతలైన పెద్దవారమల్లమ్మ, చిన్నవారమల్లమ్మ, నాగమునెమ్మ, దేవ కన్యక, సూర్యకన్యక, చంద్రకన్యక, మల్లమ్మలు ఉంటారు. మహిళలు తడిగుడ్డలతో వచ్చి అక్కదేవతలను ప్రార్థిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. బండెన్న ఆలయం వద్దకు మాత్రం మహిళలకు ప్రవేశం నిషేధం.

బండెన్న కత



బండెన్నకు మాంసాహారం సంబంధించి స్థానికంగా ఓ కథ ప్రచారంలో ఉంది. పూర్వం బండె న్న అనే రాక్షసుడు ఇక్కడ ఓ బండపైన ఉండేవాడు. పెళ్లి కాలేదు. అడవి జంతువులను వేటాడి తినేవాడు. భీకరాకారుడైన బండెన్నను ప్రసన్నం చేసుకోవడానికి ఈ ప్రాంతీయులు పూజలు చేసేవారు. బండెన్నకు ఇష్టమైన మాంసాహారం నైవేద్యంగా పెట్టేవారు. వారి మొక్కులు ఫలించేవని ప్రచారం కావడంతో ఆలయం వద్ద వేటలు నరికి మాంసాహారం వండి నైవేద్యంగా పెట్టి భోజనాలు చేయడం ఆచారంగా మారింది. బ్రహ్మచారి కావడం వల్లే ఆడవాళ్లు బండె న్న సమక్షంలోకి వెళ్లరాదని చెప్పుకుంటారు. మాంసం వండడం మొదలు, వడ్డింపుల దాకా బండెన్న ముం దు పనులన్నీ మగవాళ్లే చేస్తారు.

నిత్యాన్నదానం

ఆలయం ఎదురుగా వెలసిన కాశిరెడ్డినాయన ఆశ్రమంలో నిత్యం అన్నదానం చేస్తుంటారు. ఒక్క శివరాత్రి రోజే లక్షలాది మంది భక్తులకు భోజనాన్ని వడ్డిస్తారు.



మహాశివరాత్రికి పాలతలలో చేపడుతున్న ఏర్పాట్లపై దేవస్థానం ఈఓ కృష్ణానాయక్ ఆంధ్రజ్యోతికి వివరాలు తెలిపారు.

కృష్ణానాయక్
ఈఓ,దేవస్థానం

రవాణా సౌకర్యం...

పాలతల క్షేత్రానికి భక్తులు చేరుకునేందుకు ఘాట్ రోడ్డు ఉన్నందున కండీషన్‌లో ఉన్న 150 బస్సులను ఆర్టీసీ అధికారులు సిద్ధం చేశారు. కడప, పులివెందుల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, రాయచోటి డిపోల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయి. కొండపైన టూవీలర్, ఫోర్‌వీలర్, భారీ వాహనాలు, ఆర్టీసీకి ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేశారు.

వసతులు...

ఆలయం వద్ద ఉన్న కోనేర్లను శుభ్రం చేశారు. తాగు నీటికి ఇబ్బందులు లేకుండా 8 బోర్లు అందుబాటులో ఉన్నాయి. అంతేకాకుండా మరో 18 నీళ్ల ట్యాంకర్లు సిద్ధంగా ఉంచాము. వైద్య సేవల నిమిత్తం 108, 104, ప్రైవేటు అంబులెన్స్‌లు, భక్తులు తప్పిపోతే అనౌన్స్‌మెంట్, పారిశుధ్య సిబ్బందిని సిద్ధం చేసి ఉంచాము.

భక్తుల భద్రత

అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేశాము. పోలీసు వ్యవస్థ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది. ప్రత్యేకించి కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు, సూచిక బోర్డులు, డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తూ నిఘా పెడుతున్నాము. ఫైరింజన్లతో అగ్నిమాపక సిబ్బంది, అదనంగా మరో 150 మంది సేవకులు ఉంటారు.

ఉత్సవాలు ఇలా...

మూడు రోజులు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నాము. మొదటి రోజు బుధవారం ఉదయం 9.30 గంటలకు ముత్యాల తలంబ్రాలతో కల్యాణోత్సవం, రాత్రి పది గంటల నుంచి రథోత్సవం, హరికథ, చెక్కభజన, ఉచిత అన్నదానం, ప్రసాదం భక్తులకు అందిస్తాము. మద్యం విక్రయాలు జరపరాదని, ఆంక్షలు అతి క్రమిస్తే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారు.



చేరుకునే మార్గం...

- కడప నగరం నుంచి మూలవంక మీదుగా 25 కి.మీ. వెళ్లి కొండకు చేరుకోవచ్చు.
- పులివెందుల మీదుగా వచ్చేవారు వెల్లటూరు నుంచి తిప్పి రెడ్డిపల్లె మీదుగా చేరుకోవచ్చు.



అక్కదేవతల ఆలయం వద్ద ఉన్న కోనేరు

వివాదాస్పద భూమిలో ప్రహరీ కూల్చివేత



ఫెన్సింగ్‌ను కూల్చేస్తున్న బాధితులు

కురబలకోట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అంగళ్లు సమీప మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల పక్కనున్న వివాదాస్పద భూమిలో సిమెంట్ పలకలతో నిర్మించిన ప్రహరీని కూల్చేశారు. సర్వేనెంబర్ 220లో 69.42 ఎకరాల భూమిలో 7.66ఎకరాల భూమిపై కొన్నేళ్లగా వివాదం నడుస్తోంది. ఈ భూమిలో కొందరు ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారు. దీంతో ఆ భూమిపైకి ఎవరూ వెళ్లకుండా 145సెక్షన్‌ను అమలు చేశారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో కొందరు పులివెందుల వాసులు భూమిని ఆక్రమించు కోవడానికి ప్రయత్నించారు. దీంతో అప్పట్లో స్థానిక నేతలు వారికి సహకరించడంతో వివాదం నెలకొంది. దీంతో అప్పట్లో వైసీపీ నేతలు జోక్యం చేసుకుని ప్లాట్లు కొనుగోలు చేసిన వారి నుంచి డబ్బు వసూలు చేసి సెటిల్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వివాదం మళ్లీ మొదటికొచ్చింది. తిరుపతి, అనంతపురానికి చెందిన పలువురు భూమిని ఆక్రమించారు. మొదట్లో హక్కుదారులు అడ్డుకున్నా తాజాగా ఈ భూమి తమకు చెందుతుందని స్థానికుల అండతో అనంతపురానికి చెందిన కొందరు భూమిలోకి జొరబడి కూసాలు నాటి వెళ్లిపోయారు. రెండు నెలల అనంతరం దాదాపు 100మందితో ఆ భూమిలో సిమెంట్ పలకలతో ప్రహరీ నిర్మించి వెళ్లిపోయారు. ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు శనివారం పెద్దసంఖ్యలో చేరుకుని రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. పోలీసులు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం ప్రహరీని కూల్చి తమకు న్యాయం చేయాలని కోరారు.

గురుకుల విద్యార్థినులకు విప్రో ఎర్తియన్ అవార్డు



కలికిరి విద్యార్థినుల ప్రదర్శనను అభినందిస్తున్న విప్రో ప్రతినిధులు

కలికిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులకు విప్రో ఎర్తియన్ అవార్డును శనివారం అందజేశారు. అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్శిటీ(బెంగళూరు)లో రెండు రోజులు జరిగిన అవార్డు ప్రదానోత్సవాల్లో భాగంగా చివరి రోజు శనివారం విజేత విద్యార్థినులకు రూ.50 వేల నగదు, అవార్డును అందజేశారు. విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ, అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సీఈఓ అనురాగ్ బెహర్ విద్యార్థినులకు అవార్డులు అందజేశారు. వివిధ విభాగాల అంశాలను విప్రో, అజీమ్ ఫౌండేషన్ ప్రతినిధులకు కోఆర్డినేటర్ అప్సానా వివరించారు. ఉత్తమ ప్రదర్శనకు కలికిరి విద్యార్థినులకు వేర్వేరుగా వివిధ రకాల బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. సీపీ రామస్వామి ఎన్విరాన్‌మెంటల్ ఎడుకేషన్ సెంటర్ (సీపీఆర్‌ఈఈసీ) ఉమ్మడి ఏపీ కోఆర్డినేటర్ వెంకటరత్నం, విద్యార్థినుల కోఆర్డినేటర్, కలికిరి జేఎన్టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ అప్సానా, విద్యార్థినులు కె.ఖ్యాతి, జె.రూపిక, టి.భవ్యశ్రీ, ఎం.చందన అగర్వాల్, పి.సుప్రియలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు

రూ.2లక్షల 40వేలు విలువైన గంజాయి స్వాధీనం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బీకేపల్లె, మంజునాథ కాలనీకి చెందిన ముగ్గురు గంజాయి విక్రేతలను అరెస్టు చేసినట్లు మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు తెలిపారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిందితులను అరెస్టు చూపిన డీఎస్పీ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యాపారం చేస్తున్న బీకేపల్లె మంజునాథ కాలనీ వాసి గంటా భాగ్యమ్మ, గంజాయి విక్రయిస్తున్న లక్ష్మీనగర్ వాసి ఆవుల శివమ్మ ఇళ్లలో సోదాలు నిర్వహించి వారి నుంచి రూ. 2లక్షల40 వేలు విలువైన 20 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితులను టూటౌన్ సీఐ రామచంద్ర, ఎస్ఐ రహిమ ముల్లా, సిబ్బందితో, క్రైం ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, క్రైం ఎస్ఐ రామకృష్ణారెడ్డి సిబ్బందితో కలిసి న్యూ బైపాస్ రోడ్డులో అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. భాగ్యమ్మపై పుంగనూరు, పలమనేరు, పీటీఎం పోలీస్‌స్టేషన్లలో మూడు గంజాయి కేసులు నమోదు చేసి జైలుకు పంపినట్లు తెలిపారు. మదనపల్లె వన్ టౌన్, రూరల్ సీఐలు ఎరిసావలి, సత్యనారాయణ, క్రైమ్ సీఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదవారికే ఇంటి పట్టా అందాలి : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పేదలకే ఇంటి పట్టా అందాలని, అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిలో నిర్మాణాల క్రమబద్ధీకరణ జరుగుతుందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అన్ని మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, వీఆర్‌ఓలకు ఇళ్ల పట్టాలు, రీవెరిఫికేషన్, అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఇంటి స్థలం పట్టా అందాలని తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన మొబైల్ అప్లికేషన్ ద్వారా అనర్హులను గుర్తించి వారికి ఇచ్చిన ఇంటి పట్టాలను రద్దు చేయాలని ఆదేశించారు. కొందరు లబ్ధిదారులు అనర్హులైనా ఇంటి స్థలం పట్టా పొందాలని, వారిని లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. 2019 అక్టోబరు 15 నాటికి అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిలో కుటుంబం నివసించేందుకు అనువైన నిర్మాణాన్ని చేపట్టి ఉంటే నిర్మాణానికి సంబంధించిన ఆధారాలను నిర్మాణం చేపట్టిన వారి దగ్గర నుంచి తీసుకుని పరిశీలించిన అనంతరం క్రమబద్ధీకరణ చేయాలని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల విచారణ వేగవంతం చేయాలి

పీలేరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణను వేగవంతం చేయాలని విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, సత్యాల రామకృష్ణ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తను కోరారు. మంగళగిరిలోని కార్యాలయంలో శనివారం వారు డీజీపీని కలిశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ నిమిత్తం గతంలో ప్రత్యేక అధికారి ఉండేవారని, తద్వారా కేసుల విచారణ వేగంగా జరిగేదన్నారు. జిల్లాలో ప్రత్యేక అధికారిని నియమించాలని కోరారు.

ప్రతి విద్యార్థి కలలను సాకారం చేసుకోండి

టెక్నోకల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ అశ్వ-2కె25లో సినీనటి నేహాశెట్టి



సినీనటి నేహాశెట్టికి జ్ఞాపికను అందిస్తున్న మిట్స్ యాజమాన్యం

కురబలకోట, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి తమ కలలను సాకారం చేసు కోవాలని సినీనటి నేహాశెట్టి విద్యార్థులకు పిలుపునిచ్చారు. మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల జాతీయస్థాయి టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ అశ్వ-2కె25లో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పరచుకుని దానిని సాధించడానికి కృషి చేయాలన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, అకాడమి ప్రెసిడెంట్ నాదెళ్ల ద్వారకనాథ్, ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తదితరులు అభినందించారు.

బాలిక అదృశ్యం

కడప క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక జయనగర్‌కాలనీలో జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూలులో టెన్త్ చదువుతున్న బోయ రాజేశ్వరి అనే బాలిక అదృశ్యమైనట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి తెలిపారు. అశోక్‌నగర్ వాసి బోయహనుమంతు కుమార్తె రాజేశ్వరి శనివారం స్కూలుకు పోతున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదని బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. సమాచారం తెలిస్తే సీఐ 9121100520, ఎస్ఐ 9121100521కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ఉర్దూ భాషకు ప్రత్యేక గుర్తింపు ఉంది

- వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పద్మ

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి సాహిత్యాల్లో ఉర్దూ భాషకు ప్రత్యేక గుర్తింపు ఉందని ప్రత్యేకించి కడప ఉర్దూ సాహితీ చరిత్ర ఘనమైందని యోగివేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ అన్నారు. శనివారం యోగివేమన యూనివర్సిటీ ఉర్దూ విభాగ అధిపతి ఆచార్య కె.రియాజున్నీసా ఆధ్వర్యంలో 'కడపలో ఉర్దూ సాహిత్యం' అంశంపై జాతీయ సదస్సు ప్రారంభమైంది. సెమినార్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఉర్దూ సాహిత్యానికి ప్రాముఖ్యత ఇవ్వాలని ఉర్దూ సాహిత్యంలో కడప సాహిత్యానికి ఘనమైన చరిత్ర ఉందన్నారు.

ఏప్రిల్ 4 వరకు ఆకేపాటి ఎస్టేట్ జోలికి వెళ్లవద్దు

జేసీని కలిసిన ఆకేపాటి లాయర్లు ● తహసీల్దార్‌కు జేసీ ఆదేశం

రాయచోటి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఎస్టేట్ జోలికి ఏప్రిల్ 4 వరకు వెళ్లవద్దని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ రాజంపేట తహసీల్దార్ పీర్‌మున్నీని ఆదేశించారు. రాజంపేట మండలం మందపల్లె రెవెన్యూ విలేజ్ పరిధిలోని పలు సర్వేనంబర్లలో సుమారు 30 ఎకరాల ప్రభుత్వ భూములను అమరనాథరెడ్డి, అతడి కుటుంబ సభ్యులు ఆక్రమించుకుని ఎస్టేట్ నిర్మించుకున్నారని.. రాజంపేట టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బనరసయ్య నాయుడు ముఖ్యమంత్రి కార్యాలయానికి నాలుగు నెలల కిందట ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాలతో కలెక్టర్ స్థానిక సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ చేయించారు. ఈ విచారణలో ప్రభుత్వ భూములు ఆకేపాటి అమరనాథరెడ్డి కుటుంబ సభ్యుల ఆక్రమణలో ఉన్నట్లు తేలింది. దీంతో శనివారం తన ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ అమరనాథరెడ్డి తదితరులకు నోటీసులు ఇచ్చారు. అయితే శనివారం జాయింట్ కలెక్టర్ ఎదుట విచారణకు అమరనాథరెడ్డి హాజరు కాలేదు. ఆయన తరపున న్యాయవాదులు హాజరయ్యారు. ఇప్పటికే జాయింట్ కలెక్టర్ నోటీసులపైన కోర్టును ఆశ్రయించామని, తమ పిటిషన్ ఏప్రిల్ 4న విచారణకు వస్తుందని, అప్పటి వరకు రాజంపేట రెవెన్యూ అధికారులు ఆకేపాటి ఎస్టేట్ జోలికి వెళ్లకుండా చూడాలని కోరారు. దీంతో ఏప్రిల్ 4 వరకు ఆకేపాటి ఎస్టేట్ జోలికి వెళ్లవద్దని జాయింట్ కలెక్టర్ రాజంపేట తహశీల్దార్‌ను ఆదేశించినట్లు సమాచారం

పురపాలికలో ప్రొటోకాల్ రగడ

● బైఠాయించిన వైసీపీ కౌన్సిలర్లు



చైర్‌పర్సన్ మనూజను ప్రశ్నిస్తున్న వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి

మదనపల్లె, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీలో ఎక్కడా ప్రొటోకాల్ పాటించడం లేదని వైసీపీ కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారిక కార్యక్రమైనా, ప్రతినెలా పింఛన్ పంపిణీ అయినా ఇదే పరిస్థితి ఉందని వారు వాపోయారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ వి.మనూజ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఇదే అంశంపై తీవ్ర దుమారం రేగింది. వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, కౌన్సిలర్ కె.ప్రసాద్‌బాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ క్రమంలో చైర్‌పర్సన్ పోడియం ముందు వైస్‌చైర్మన్లు జింకా వెంకటాచలపతి, బి.ఎ.నూర్ ఆజాం, కౌన్సిలర్లు బైఠాయించారు. అటు చైర్‌పర్సన్ మనూజ, ఇటు కమిషనర్ కె.ప్రమీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన తమను కనీసం తమ వార్డులో జరిగే కార్యక్రమాలకు ఆహ్వానించకుండా అవమానిస్తున్నారని మండిపడ్డారు. తాము ఎక్కడికి వెళ్లినా పనులు జరగకుండా అడ్డకుంటున్నారని వాపోయారు. కౌన్సిల్ సమావేశానికి కూడా వారినే పిలిపించుకుని సమావేశం నిర్వహించాలని, అజెండా ఆమోదం(సీఆర్)కూడా వారి నుంచే చేయించుకోవాలని ధ్వజమెత్తారు. ఎక్కడా కూడా కౌన్సిలర్లకు గౌరవం తగ్గకుండా, ప్రొటోకాల్‌ను అమలు చేస్తామన్న హామీతో ఆందోళన విరమించారు.

ఆర్థిక పరిపుష్టితో జిల్లా ముందుకు

కేంద్ర ఆర్థిక సేవా రంగ డీడీజేఎం జయశ్రీ

కడప ఎన్టీఆర్‌సర్కిల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి సాధనలో భాగంగా ఆర్థిక పరిపుష్టి, అన్ని ప్రమాణికాల్లో జిల్లా ముందంజలో కొనసాగడం అభినందనీయని కేంద్ర ఆర్థిక సేవా రంగ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఏం.జీ.జయశ్రీ అన్నారు. శనివారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అధ్యక్షతన ఆకాంక్షిత జిల్లాలో 'ఆర్థిక పరిపుష్టికి పర్ఫార్మెన్స్ ఇండికేటర్' అంశంపై బ్యాంకు అధికారులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి ఆమెతో పాటు కెనెరా బ్యాంక్ డీజీఎం ఆర్తిఅగర్వాల్, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ శ్రీనివాస్ హాజరయ్యారు. డీడీజేఎం మాట్లాడుతూ ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి సాధనలో భాగంగా 'ఆర్థిక పరిపుష్టి, నైపుణ్య అభివృద్ధి' అంశాల్లో అత్యుత్తమ పనితీరును కనబరిచనందుకు జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ ద్వారా అత్యుత్తమ పురస్కారం బహూకరించడం అభినందనీయమన్నారు. దేశవ్యాప్తంగా 112 ఆకాంక్షిత జిల్లాల్లోని 36జిల్లాలకు ఈ అత్యుత్తమ పురస్కారం వరించగా అందులో వైఎస్సార్ జిల్లా కూడా ఒకటిగా పురస్కారాన్ని అందుకోవడం గర్వించగ్గ విషయమన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ జనార్ధనం, నాబార్డు ఏజీఎం విజయవిహారి, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంపై ఇరువర్గాల ఘర్షణ

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో భూ వివాదంపై ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. చియ్యవరం పంచాయతీ పరిధి మొలకలపోడు హరిజనవాడ వాసులు ఇంద్రమ్మ, గుండాల పెంచలయ్య మరో ఇద్దరు ప్రభుత్వ భూమిలో పనులు చేస్తుండగా గుండాల రవి కుమార్‌కు చెందిన మరో వర్గం అడ్డుపడి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాలు తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని తమ వద్ద భూమి పత్రాలు ఉన్నాయని వాదోపవాదాలు పడి ఘర్షణకు పాల్పడ్డారు. పోలీసులు ఇరు వర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనపై విచారిస్తున్నట్లు సీఐ హేమసుందర్ తెలిపారు.

దివ్యాంగుల క్రికెట్‌లో రాణించిన శివకోటి



నందలూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల క్రికెట్‌లో భాగంగా నేపాల్‌తో జరిగిన టీమ్ 20 క్రికెట్ మ్యాచ్‌లో భారత జట్టు తరఫున పాల్గొన్న నందలూరు వాసి ఏల్చూరు శివకోటి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. శివకోటి మాట్లాడుతూ నేపాల్‌జట్టును భారత జట్టు క్లీన్‌స్వీప్ చేసిందన్నారు. తాను భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించినట్లు తెలిపారు. మూడు టీ20 మ్యాచ్‌ల్లో 72 పరుగులు చేసి 11 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్‌గా ఎంపికయ్యాయన్నారు. ఫిబ్రవరి 14 నుంచి 20వ తేదీ వరకు బోర్డ్ ఆఫ్ డిసేబుల్డ్ క్రికెట్ ఇండియా ఆధ్వర్యంలో నేపాల్‌లో జరిగిన క్రికెట్ చివరి మ్యాచ్‌లో కెప్టెన్ అవకాశాన్ని అంది పుచ్చుకుని అద్భుతమైన ఆటతో భారత జట్టును విజయ తీరాలకు చేర్చానన్నారు. క్రీడా జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నానన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఓబులవారిపల్లె వాసి సింగయ్యగారి లక్ష్మీ కనపడలేదని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. ఫిబ్రవరి 20వ తేదీ ఉదయం నుంచి ఇంటినుంచి వెళ్లిన ఆమె కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసినవారు ఎస్ఐకి 9121100580 సమాచారం ఇవ్వాలని తెలిపారు.

25, 26న పులివెందులకు జగన్

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైసీపీ నేత వైఎస్ జగన్ 25, 26 తేదీల్లో పులివెందులలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో భాకరాపురంలోని హెలీప్యాడ్‌ను శనివారం అర్బన్ సీఐ నరసింహులు పరిశీలించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ 26న ఉదయం పులివెందులకు చేరుకుని ఆయన వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉండనున్నారు. 26న రాజారెడ్డి ఆస్పత్రి స్థానంలో కొత్తగా నిర్మించిన ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిని మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రారంభించనున్నారు. దీంతో పులివెందులలో రెండు రోజుల పర్యటన ముగియనుంది. మాజీ సీఎంపర్యటన సందర్భంగా బందోబస్తులో భాగంగా అర్బన్ సీఐ నరసింహులు పరిశీలించారు.

సిద్దేశ్వర ఆలయ భూములు కాపాడండి

● త్రిసభ్య కమిటీకి కలమల్ల గ్రామస్తుల వినతి



ఆలయ భూములపై కలమల్లవాసులతో చర్చిస్తున్న ఆర్డీవో

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత కలమల్లలో వెలసిన సిద్దేశ్వరస్వామి ఆలయ 63 ఎకరాల మాన్యం భూముల విషయంలో న్యాయం చేయాలని కలమల్లవాసులు శనివారం త్రిసభ్య కమిటీకి విన్నవించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో సాయిశ్రీ, మల్లికార్జునప్రసాద్, తహసీల్దార్ శోభన్‌బాబు, జిల్లా సర్వేయర్ శనివారం కలమల్లలోని ఆలయాలను సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. టెంపుల్ సర్వేనెంబర్లు, మొత్తం భూముల వివరాలను సేకరించారు. అలాగే శాసనాలను తిలికించి వాటి వివరాలు తీసుకున్నారు. గ్రామస్తులు అధికారులకు పూర్తి వివరాలు అందజేశారు. వీటిపై సమగ్రంగా విచారించి ఆర్డీవో ద్వారా కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని అధికారులు వెల్లడించారు. ఇటీవలే గ్రామస్తులు ఈ విషయంపై కలెక్టర్‌ను కలిసి న్యాయం చేయాలని వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు క్రిష్ణయ్య, పుల్లారెడ్డి, కమిటీకి చెందిన శంకరయ్య, గిరి, సాంబశివారెడ్డి, రామాంజనేయులు, చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో చోరీ

గోపవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దగోపవరం గ్రామంలో వెలసిన వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు హుండీని పగలగొట్టి అందులో ఉన్న సుమారు రూ.లక్ష నగదు తీసుకువెళ్లారని గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఉదయం గ్రామస్తులు ఆలయంలో పరిశీలించి విషయం తెలుసుకున్నారు. హుండీని ఆలయం వెనుక తీసుకెళ్లి పగలగొట్టి అందులో ఉన్న సొమ్మును తీసుకెళ్లినట్లు అనుమానిస్తున్నారు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

పది పరీక్షలు.. ఇక 22 రోజులే



● విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దు

● మెలకువలు పాటిస్తే.. విజయం మీదే

● విద్యార్థులకు నిపుణుల సూచనలు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలు ఇక 22 రోజులే ఉన్నాయి. ఈ క్రమంలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యంగా డిసెంబరు 1 నుంచి వంద రోజుల యాక్షన్‌ప్లాన్‌ను ఉన్నతాధికారులు అమలు చేశారు. గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళిక రూపొందించారు. 2025 మార్చి 17 నుంచి జరిగే పరీక్షలకు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి 27,833 మంది విద్యార్థులు ఉన్నారు. కాగా సమయం దగ్గర పడుతుండడంతో విద్యా ర్థులు ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు సులభంగా ఉత్తీర్ణుల య్యేందుకు వీలుగా సబ్జెక్టు నిపుణుల ద్వారా అభ్యాసన మెలకువలు తెలియజేశారు.

గణితంలో ఆరు అంశాలు చదవండి

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు



గణితంలో కనీస స్థాయి ఉన్న ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత పొందాలంటే వాస్తవ సంఖ్యలు, బహుపదులు, రెండు చరరాశులలో రేఖీయ సమీకరణాల జత, పాఠ్యాంశాలలో ముఖ్యమైన సమస్యలను నేర్చుకోవాలి. రెండు చరరాశులలో రేఖీయ సమీకరణాల జతలోని గ్రాఫ్ 8 మార్కులకు ఖచ్చితంగా వస్తుంది. నిరూపక జామితి పాఠ్యాంశం నుంచి సెక్షన్ ఫార్ములాకు చెందిన సమస్యలు నాలుగు లేదా ఎనిమిది మార్కులకు వచ్చే అవకాశం ఉంది. సాంఖ్యక శాస్త్రంలోని మీన్, మోడ్, మీడియన్‌పై తప్పక 8 మార్కుల ప్రశ్న ఉంటుంది. ఈ సూచనలను పాటించి ప్రాక్టీస్ చేస్తే ప్రతి విద్యార్థి గణితంలో సులభంగా ఉత్తీర్ణత పొందుతారు.

సాంఘిక శాస్త్రంలో శ్రద్ధ వహిస్తే మంచి ఫలితాలు

- షేక్ మహబూబ్‌షరీఫ్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత



పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు సమయం చాలా తక్కువగా ఉంది. సాంఘిక శాస్త్రంలో విద్యార్థులు సరైన శ్రద్ధ వహిస్తే మంచిమార్కులు సాధించడం పెద్ద కష్టం కాదు. ఇందులో కొన్ని సూచనలు పాటించడం అవసరం. ఎస్‌సీఈఆర్‌టీ వారు ఏ పాఠంలో ఎన్ని మార్కులకు ప్రశ్న వస్తుందో క్లియర్‌గా అందజేసిన బ్లూప్రింట్‌ను విద్యార్థులు అనుసరించాలి. అదేవిధంగా వారు అందజేసిన మూడు మోడల్ పేపర్లను క్షుణ్ణంగా నేర్చుకోవాలి. భారతదేశం, ప్రపంచపటంలోని అంశాల పట్ల బాగా శ్రద్ధ పెట్టాలి. పరీక్ష సమయంలో జవాబు రాయడంతో పాటు ముఖ్యమైన విషయాలను అండర్ లైన్, హైలెట్ చేయడం ద్వారా మంచి మార్కులను పొందవచ్చు.

తెలుగులో దోషాలు రాకుండా చూడాలి

- డి.చెంగల్‌రెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు



తెలుగులో దోషాలు లేకుండా సమాధానాలు రాస్తే 20 శాతం మార్కులు సులువుగా వస్తాయి. పద్యభాగంలో కవి పరిచయం, గద్యంలో ప్రక్రియలు, లేఖ, కరపత్రం అంకాలు, చంధస్సులో వృత్త పద్యాలపై ప్రశ్నలొస్తాయి. మారీచుడు, కైక, విశ్వామిత్రుడు, సుగ్రీవుడు, దశరథుడు వంటి అంశాలతో పాటు రామాయణం ప్రాశస్త్యం, సీతారామ కల్యాణం, సేతువు నిర్మాణం, సీతాన్వేషణ, వృత్తాంతం, సీతాపహరణం వంటి అంశాలపై పట్టు సాధిస్తే అధిక మార్కులు సొంతం చేసుకోవచ్చు.

ఇంగ్లీష్‌లో ప్యాసేజ్ అంశాలపై పట్టుండాలి

- టి.జాన్ సుందర్‌రాజు, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు



ఇంగ్లీష్‌లో ఎడిటింగ్, ప్యాసేజ్ అంశాలపై ప్రధానంగా పట్టు సాధించాలి. యాక్టివ్ వాయిస్, ప్యాసివ్ వాయిస్ వంటి అంశాలను చదవాలి. ఒకాబులరీ, గ్రామర్, టెక్స్ టూల్‌ను ఎక్కువగా సాధన చేయాలి. రెయిమ్స్, స్కీమ్, పొనెటిక్స్‌ను చదివితే సులువుగా రాయవచ్చు.

ఇంటిపన్నుల బకాయిలపై మున్సిపల్ అధికారుల చర్యలు

● ఒక్కరోజే రూ.32.27 లక్షల మొండి బకాయి వసూళ్లు



పన్ను బకాయి వున్న దుకాణాన్ని సీజ్ చేస్తున్న కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నుల బకాయిలపై మున్సిపల్ అధికారులు చర్యలకు దిగారు. శనివారం పట్టణంలో గాంధీరోడ్డులో గల ఒక మొండిపన్ను బకాయిదారుడి బట్టల దుకాణాన్ని కమిషనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో సీజ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో 2024-2025 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.19 కోట్లు బకాయిలున్నాయన్నారు. ముఖ్యంగా టాప్ 100లో వున్న లక్షల మొండిబకాయిదారుల దుకాణాలు, ఇళ్లకు తాళాలు వేస్తున్నామన్నారు. ప్రతి రోజు రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి టార్గెట్ పెట్టామని తెలిపారు. మార్చి 15 నాటికి 80 శాతం వసూళ్లు పూర్తి చేసేందుకు ప్రతిరోజు సచివాలయాల సిబ్బందితో సహా కార్యాలయం సిబ్బందిని కలెక్షన్‌కు వినియోగిస్తామన్నారు. శనివారం ఒక్కరోజే రూ.32.27 లక్షలు వసూలు చేశామని, పన్నులు వస్తేనే ఉద్యోగులందరికి జీతాలు లేకుంటే జీతాలుండవని హెచ్చరించామన్నారు. ఈ పన్ను వసూళ్లలో ఆర్ఐ శివచరణ్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేలు విరాళం

చక్రాయపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ప్రొద్దుటూరు పట్టణం మలిశెట్టి కొండన్నవారి ధర్మపత్ని కీ.శే.రామసుబ్బమ్మ జ్ఞాపకార్థం రూ.50116 విరాళంగా ఇచ్చారు. వీరికి దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆలయమర్యాదలతో ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్‌లు ఘనంగా పూజలు నిర్వహించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సెలవు ఇవ్వలేదని.. చేయి కోసుకున్న ఏఎన్‌ఎం



కన్నీటిపర్యంతమవుతున్న సింధు

చాపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లె గ్రామ సచివాలయం వద్ద సింధు అనే ఏఎన్‌ఎం శనివారం సాయంత్రం గాజుతో తన ఎడమచెయ్యి కోసుకున్నట్లు సిబ్బంది తెలిపారు. ఈమె ఇక్కడ రెండేళ్లుగా పనిచేస్తోంది. నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈ గ్రామం ఉంది. అక్కడ జూనియర్ డాక్టర్‌గా పనిచేస్తున్న కావ్యమాధురిని సెలవు ఇవ్వాలని కోరగా ఆమె ఇవ్వలేదని సిబ్బంది తెలిపారు. డిగ్రీ దూర విద్యకు సంబంధించి ఈ నెల 24 నుంచి పరీక్షలు రాసేందుకు సెలవులు కావాలని సింధు డాక్టర్‌ను కోరగా.. సెలవు ఇవ్వలేదు. దీంతో చెయ్యి కోసుకున్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారు. ఈ విషయమై చాపాడులోని పీహెచ్‌సీ సీనియర్ డాక్టర్ రాజేష్‌కుమార్‌ను వివరణ అడుగగా.. సింధు చెయ్యి కోసుకున్న విషయం వాస్తవమేనన్నారు. ఆమె ఇటీవల 15 రోజులు సెలవులు తీసుకున్నట్లు ఆయన చెప్పారు. ఆదివారం ఈ విషయమై పూర్తి విచారణ చేస్తామన్నారు.

అభివృద్ధికి పరిశుభ్రతే మూలం: డీపీవో



చెన్నూరు మైనార్టీ కాలనీలో వీధులు శుభ్రం చేస్తున్న డీపీవో రాజ్యలక్ష్మి

చెన్నూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి పరిశుభ్రతే మూలమని, ప్రజలు తమ గ్రామంతో పాటు వారి వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి అన్నారు. రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు మండలంలోని చెన్నూరు, రామనపల్లె, కొండపేట గ్రామాల్లో ఈవోఆర్‌డీ సురేశ్‌బాబుతో కలిసి పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్ల ముందు ఉన్న చెత్తచెదారాన్ని నిత్యం తొలగించుకోవాలని, మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగినప్పుడే వారి కుటుంబసభ్యులు ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడుపుతారన్నారు. ఈ సందర్భంగా డీపీవో గ్రామాల్లో ఈవోఆర్‌డీతో కలిసి చీపురు చేతబట్టి చెత్తచెదారాన్ని తొలగించిశ్రమం చేశారు. అలాగే ఇంటింటికీ వెళ్లి తడి పొడి చెత్త ఎలా సేకరిస్తున్నారు. ఇల్ల వద్దకు వచ్చిన వారికి ఎలా ఇంటిలోని తడి పొడి చెత్త వేస్తున్నారని ప్రశ్నించి ఏది ఎలా అందివ్వాలో చెప్పడం జరిగింది. అంతేగాక ఈ మూడుపంచాయతీలోని వర్మీకంపోస్టు కేంద్రాలు పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు గురువేశ్వర్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, హరిత రాయబారలుఉ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కలమల్ల ఎస్‌ఐపై చర్యలు తీసుకోండి

● పోలీసుస్టేషన్ వద్ద బాధితుడు బైఠాయింపు



కలమల్ల పోలీసుస్టేషన్ ముందు బైఠాయించిన గోర్ల ఓబులేసు

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కలమల్ల ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన గోర్ల చిన్న ఓబులేసు శనివారం పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించారు. ఆయన మాట్లాడుతూ 14.12.2024న కలమల్లకు చెందిన పొన్న శివతో ప్రాణహాని వుందని ఎస్పీకి ఫిర్యాదు చేశానని, అది సీఐ ద్వారా కలమల్ల ఎస్‌ఐకి రెఫర్ చేశారన్నారు. అలాగే 27.01.2025న తాను ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చించి వేశారని ఎస్పీకి ఫిర్యాదు చేశానన్నారు. ఈ రెండు ఫిర్యాదుల విషయంపై బుధవారం ఎస్‌ఐ తిమోతిని కలిసి తన ఫిర్యాదులకు న్యాయం చేయాలని అడగ్గా తనను ధూషించినట్లు ఆరోపించారు. అంతేకాకుండా కలమల్ల చుట్టూ ఆటవిక రాజ్యం కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్టేషన్ ఎదుట బైఠాయించారు.

చర్యలు తీసుకుంటాం: సీఐ రఫి

స్టేషన్ ఎదుట బైఠాయించిన గోర్ల చిన్నఓబులేసు విషయంపై కొండాపురం సీఐ రఫీ మాట్లాడుతూ పొన్నా శివపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. కోర్టు అనుమతి కోసం ఎదురు చూస్తున్నామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు అరెస్టు చేస్తామన్నారు. అలాగే ఓబులేసు ఫిర్యాదు చేసిన ఇతర విషయాలపై కూడా పరిశీలిస్తామని తెలిపారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన వుండాలి

● సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి

కడపరూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చట్టాలపై అవగాహన వుండాలని, తద్వారా ఎదురయ్యే సమస్యలను సులువుగా పరిష్కరించుకోవచ్చని డీఎల్‌ఎస్‌ఏ ఇన్‌చార్జ్ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి తెలిపారు. శనివారం డీఎల్‌ఎస్‌ఏ ఆధ్వర్యంలో నగరంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో లీగల్ సర్వీసెస్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు చట్టాల గురించి తెలియజేశారు.

5333 గృహాల్లో ఇంటింటా న్యాయప్రచారం

జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఇంటింటా న్యాయప్రచారాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు శనివారం 5333 గృహాలలో ఇంటింటా న్యాయప్రచారం నిర్వహించి 57 మంది ఎదుగుదల లోపాలు ఉన్న పిల్లలను గుర్తించామన్నారు. పుట్టినప్పటి నుంచి 18 ఏళ్ల లోపు గల పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగుదల లోపాలకు సంబంధించిన సమస్యల గుర్తింపు, నివారణ కొరకు ఇంటింటి న్యాయప్రచారం చేపడుతున్నామన్నారు. ఇందుకు జిల్లా వ్యాప్తంగా 46 టీమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక్కో టీంలో ఒక ప్యానల్ న్యాయవాది, ఒక పారాలీగల్ వలంటీర్, ఏఎన్‌ఎం, ఆశావర్కర్, అంగన్‌వాడీ వర్కర్, వైద్యాధికారి, భవిత సెంటర్ నిర్వాహకులు తదితరులు ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని ప్రత్యేక పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీపీడబ్ల్యుఎస్ స్కీంల పనితీరు మెరుగుపడాలి : సీఈవో

కడప రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సీపీడబ్ల్యుఎస్ స్కీంల పనితీరును మరింతగా మెరుగు పరిచి ప్రజలకు అవసరమైన తాగునీటిని సరఫరా చేయాలని జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ అధికారులకు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. శనివారం కమలాపురం నియోజక వర్గంలోని కమలాపురం, పెండ్లిమర్రి, వల్లూరు ప్రాంతాలలోని సీపీడబ్ల్యుఎస్ స్కీంలను పరిశీలించారు. సీపీడబ్ల్యుఎస్ స్కీంల నిర్వహణ, పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీపీడబ్ల్యుఎస్ స్కీంల నిర్వహణకు ప్రభుత్వం లక్షలాది రూపాయలను ఖర్చు చేస్తోందన్నారు. ఇవి ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. సీపీడబ్ల్యుఎస్ స్కీం పరిధిలోని ప్రతి గ్రామానికి తాగునీరు సరఫరా కావాలన్నారు. ఇందులో అధికారులు, కాంట్రాక్టర్లు అలసత్వం వహించరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు ఉన్నారు.

కమలాపురం రూరల్: ప్రజలకు నీటి కష్టాలు రాకుండా చూడాల్సిన బాధ్యత మీపై ఉందని జడ్పీ సీఈవో ఓబులమ్మ తెలిపారు. శనివారం మండల పరిధిలోని పాపాఘ్నినది సమీపంలో ఉన్న తాగునీటి సరఫరా పంపుసెట్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్నది వేసవి కాలం అని, నీటికష్టాలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ ఎంపీడీఓ జ్యోతి, మున్సిపల్ కమిషనరు జగన్నాధం కాంట్రాక్టర్ పి.యల్లారెడ్డి పంపు ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం

● జిల్లా అధ్యక్షుడిగా బి.క్రిష్ణకుమార్

కడప క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు శనివారం ఏఈఎస్ వినోద్ నాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడిగా బి.క్రిష్ణకుమార్, కడప ఎక్సైజ్ సీఐ అసోసియేషన్ అధ్యక్షుడిగా శశిధర్, ఉపాధ్యక్షుడిగా యల్లయ్య, కార్యదర్శిగా సురేశ్‌కుమార్, ఆర్గనైజరు సెక్రటరీగా విన్నీలత, జాయింటు సెక్రటరీగా హుసేన్‌బాషా, ట్రెజరర్‌గా రాంప్రసాద్, వీసీ మెంబర్లుగా సీతారామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, విశ్వనాథరెడ్డి, హిమబిందు, సుధాకర్, కళ్యాణ్‌కుమార్‌లను ఎన్నికయ్యారు.

పెట్రోలు బంకులపై విజిలెన్స్ తనిఖీ

కడప క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప, ప్రొద్దుటూరు, రాయచోటి ప్రాంతాల్లోని పెట్రోలు బంకులపై శనివారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పెట్రోలు, డీజల్ అమ్మకాలు, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెట్రోలు క్వాలిటీపై పరీక్ష నిర్వహించారు. పెట్రోలు, డీజల్ విక్రయాల్లో అవకతవకలు జరిగినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐలు నాయకుల నారాయణ, శివన్న, డీఈఈ జవహర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

● బంగారం స్వాధీనం.. వాహనాలు సీజ్

రాప్తాడు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అనంతపురం, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాలలో దొంగతనాలకు పాల్పడిన మహమ్మద్ రఫిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 12 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ శ్రీహర్ష శనివారం తెలిపారు. కడప జిల్లా దువ్వూరు మండలం జిల్లాల గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీ.. మొత్తం 8 దొంగతనం కేసుల్లో ప్రధాన నిందితుడని సీఐ తెలిపారు. నాలుగు జిల్లాలో చోరీ చేసిన సుమారు 47 తులాల బంగారాన్ని బెంగళూరులోని అట్టికా గోల్డ్ కంపెనీలో విక్రయించాడు. వచ్చిన డబ్బుతో కారు, బుల్లెట్, స్కూటీ కొనుగోలు చేశాడు. వాటిని సీజ్ చేశామని సీఐ తెలిపారు. బెంగళూరులో గోల్డ్ కంపెనీకి అమ్మిన మొత్తం బంగారాన్ని రికవరీ చేసేందుకు ఆ కంపెనీకి నోటీసులు జారీ చేశామన్నారు. నిందితుడిపై కడప, కర్నూలు, నంద్యాల జిల్లాలలోని పోలీస్ స్టేషన్లలో పాత చోరీ కేసులు కూడా ఉన్నాయని సీఐ తెలిపారు.

అవి.. ఇవి.. అన్నీ

ఇంటింటా న్యాయ ప్రచారం

వల్లూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు వల్లూరు మండలంలో శనివారం ఇంటింటా న్యాయ ప్రచార కార్య క్రమం అడ్వకేట్ విక్రం, పారాలీగల్ సర్వీస్ సుభాల్ దరియా ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ 0-18 సం వత్సరాల వయస్సున్న వారికి పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించి నివారణ కోసం ప్రయత్నిస్తామన్నారు. అలా గుర్తించిన వారు కడపలోని సత్వర చికిత్సా కేంద్రం, జిల్లా బాలభవిత కేంద్రాలకు వెళ్లాలన్నారు.

పిల్లలు రక్తహీనతకు గురికాకుండా చూసుకోవాలి

వల్లూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ కిశోర బాలికల సంరక్షణ కార్యక్రమం ద్వారాపిల్లలు రక్తహీనత బారిన పడకుండా చూసుకోవాలని జిల్లా ఎయిడ్స్, లెప్రసీ అధికారి రవిబాబు పేర్కొన్నారు. శనివారం ఆయన తప్పెట్ల సవాలయ పరిధిలోని ఆరోగ్య కేంద్రం, అలాగే స్థానిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో చేస్తున్న పరీక్షలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తప్పెట్లలోని పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఐరన్‌మాత్రలు, నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారా అని అడిగి తెలుసకున్నారు. విద్యార్థులకు ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేయాలన్నారు. వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. పీహెచ్‌సీ వేణుగోపాల్, స్థానిక టీచరు విజయభారతి పాల్గొన్నారు.

ట్రెజరీ కార్యాలయ ఆవరణంలో కోర్టు ప్రారంభం



కోర్టు భవనాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణంలో ఉన్న ట్రెజరీ కార్యాలయం గ్రౌండ్ ఫ్లోరులో తాత్కాలిక నూతన కోర్టు భవనాన్ని శనివారం కడప మూడో అదనపు కోర్టు న్యాయమూర్తి విజయలక్ష్మి ప్రారంభించారు. ప్రస్తుతం ఇక్కడ నిర్వహిస్తున్న కోర్టు బ్రిటీషు కాలం నాటిది. ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో గతంలో జిల్లా జడ్జి కోర్టు ప్రాంగణాన్ని పరిశీలించి నూతన కోర్టు అవసరమని ప్రతిపాదన పంపారు. అనంతరం రూ.8 కోట్లతో నూతన కోర్టుభవన నిర్మాణం కోసం అనుమతులు వచ్చాయి ఆ పనులు త్వరలో ప్రారంభించేందుకు కోర్టు సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో నూతన కోర్టుభవన నిర్మాణం చేపట్టనున్నారు. అంతవరకు ట్రెజరీ కార్యాలయం గ్రౌండ్ ఫ్లోరులో తాత్కాలిక కోర్టును నిర్వహించనున్నారు.బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పుష్పరాజు, న్యాయవాదులు రవీంద్రప్రసాద్, నారాయణరెడ్డి, గురవయ్య, మహేశ్వర్‌రెడ్డి, రామచంద్రుడు, ఉదయ్‌కిరణ్, శ్రీనివాసులు, మహేశ్ పాల్గొన్నారు.

బియ్యం దొంగ పేర్ని నాని నీతులు చెప్పడం సిగ్గుచేటు

● టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు రాంప్రసాద్



మాట్లాడుతున్న రాంప్రసాద్

కడప రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి దొంగల ముఠా సభ్యుడైన పేదల రేషన్ బియ్యం దొం గ పేర్ని నాని నీతులు చెప్పడం సిగ్గుచేటని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు యాటగిరి రాంప్రసాద్ ధ్వజమెత్తారు. శనివారం నగరంలోని టీడీపీ బీసీ సెల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇంట్లో ఆడవాళ్లను అడ్డం పెట్టుకొని అక్రమ వ్యాపారాలు చేసే పేర్నినాని మంత్రి కొల్లు రవీంద్రను విమర్శించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మచ్చలేని నాయకుడుగా ఉంటూ ముఖ్యమంత్రి, సహచర మంత్రులతో ప్రశంసలు అందుకుంటుంటే ఓర్వలేని పేర్ని నాని అవాకులుచవాకులు పేల్చడం సరికాదన్నారు. దొంగల ముఠాలోని మరో సభ్యుడైన వల్లభనేని వంశీ నీలాగే మేక పోతు గంబీరాలు పోతూ వచ్చాడని, ఆయన ఇప్పుడు ఎక్కడ ఉన్నాడో గుర్తుకు తెచ్చుకోని జాగ్రత్తగా మసులుకోవాలన్నారు.

పిల్లలకు బైకు ఇస్తే కఠిన చర్యలు : ట్రాఫిక్ సీఐ

కడప క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే బైకు ఇవ్వాలని, ఈ నిబంధన అతిక్రమిస్తే చర్యలు తప్పవని కడప ట్రాఫిక్ సీఐ జావేద్ హెచ్చరించారు. వాహన తనిఖీలో భాగంగా శనివారం మైనర్లు నడుపుతున్న వాహనాలను సీజ్ చేశారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

మైనర్ల డ్రైవింగ్‌పై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్

కడపలో మైనర్ల బైక్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్‌పై సీఐ జావేద్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 16 బైక్‌లు సీజ్ చేసినట్లు తెలిపారు. ఎంవీఐ చట్టం ద్వారా ర్యాష్ డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవని, కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నేడు నెలనెలా సీమ సాహిత్యం

కడప కల్చరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నెలనెలా సీమ సాహిత్య కార్యక్రమంలో భాగంగా 141వ సదస్సును ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. ఈ సదస్సులో ఆచార్య పొలకలూరి ఇనాక్ నవలాసాహిత్యం అనే అంశంపై శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పరిశోధక విద్యార్థి రమేశ్‌బాబు ప్రసంగిస్తారన్నారు.

సీనియారిటీ జాబితాలలోని తప్పులను సవరించండి: ఎస్టీయూ

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం సమాచార ఆధారంగా కడప డీఈఓ కార్యాలయం విడుదల చేసిన ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలోని తప్పులను సవరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాషా, సంగమేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కడప నగరం డీఈఓ కార్యాలయంలో జరిగిన ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశంలో డీఈఓ షంషుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఆధారంగా ఉపాధ్యాయుల వివరాలు సక్రమంగా నమోదైనప్పటికీ కొన్ని సాంకేతిక కారణాలతో సీనియారిటీ జాబితాలో అవకతవకలు ఏర్పడ్డాయన్నారు. ఈ జాబితా ఆధారంగా పదోన్నతులు చేపడితే అర్హులైన ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుందని కాబట్టి నిర్ణీత కాలంలో జాబితాలను సవరించాలని వారు కోరారు.

రేపు కలెక్టరేట్ ఎదుట వంట ఏజెన్సీ కార్మికుల ధర్నా

చెన్నూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీ కార్మిక సంఘం ఏఐటీయూసీ పిలుపు మేరకు ఏజెన్సీల సమస్యలపై ఈనెల 24న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు మధ్యాహ్న భోజనం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.మేరి తెలిపారు. శనివారం చెన్నూరులో విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం రేట్లకు అనుగునంగా ప్రతి పిల్లవాడికి రూ.30 అందాలని డిమాండ్‌చేశారు. సబ్సిడీతో కూడిన వంట గ్యాస్ సిలిండరును ప్రభుత్వం సరఫరా చేయాలని పెండింగులో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలన్నారు.

రంజాన్ మాసంలో ఉర్దూ పాఠశాలల పనివేళలు మార్పు చేయాలి

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే మార్చి 2వతేదీ నుంచి రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని ఉర్దూ పాఠశాలల పనివేళలు మార్పు చేయాలని ఆలిండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ (ఐటా) రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అబ్దుల్‌రజాక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నజీర్‌బాషా, అబ్బాస్ అలీ కోరారు. శనివారం ఐటా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రంజాన్ మాసంలో ముస్లిం ఉపాధ్యాయులు, విద్యార్థులు నెలరోజుల పాటు ఉపవాసాలు పాటిస్తారన్నారు. వీరి సౌలభ్యం కోసం దశాబ్దాలుగా ఉర్దూ పాఠశాలలను ఒంటిపూట నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు.



చెన్నూరు కొత్తరోడ్డు ఆర్సీఎం చర్చి నుంచి బుడ్డాయపల్లె వెళ్లే దారి అపరిశుభ్రతకు నెలవై నిత్యం కంపుకొడుతూ ఉంటుంది. పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ బాటిళ్లు, ఇళ్లల్లో పనికిరాని వస్తువులు వేయడంతో అక్కడ చెత్తనిల్వలు పేరుకుపోయి అవి కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో పందులకు నెలవైంది. దీని పక్కనే అంగన్వాడీ కేంద్రం ఉండడంతో తమ పిల్లలు ఎక్కడ అనారోగ్యంపాలవుతారోనని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించాలని విన్నవిస్తున్నారు. -చెన్నూరు, (ఆంధ్రజ్యోతి)

జాతీయోద్యమానికి ప్రేరణ ఇచ్చిన ఉయ్యాలవాడ తిరుగుబాటు

● వర్ధంతి సభలో పలు పార్టీల నేతలు



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నాటి జాతీయోద్యమానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి తిరుగుబాటు ప్రేరణగా నిలిచిందని పలు పార్టీలకు చెందిన నాయకులు పేర్కొన్నారు. శనివారం రేనాటి సూర్యచంద్రుల విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్ లో ఉయ్యాలవాడ 178వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.హరీంద్రనాథ్, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి నిమ్మకాయల రవిశంకర్‌రెడ్డి, రెడ్డిసేవా సమితి జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి హాజరై ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు మనదేశానికి వచ్చిన ఈస్టిండియా కంపెనీ తెల్లదొరలుసాగించిన పలు దోపిడీలు, ఆధిపత్యాలకు దీటుగా ఎదుర్కొన్న వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని కొనియడారు. కాగా నాటి పరాయి పాలనలో పలు బాధలు అనుభవించిన రైతులు, గిరిజనులు, బంట్రోతులు ఉయ్యాలవాడ తిరుగుబాటులో భాగస్వాములయ్యారన్నారు. తెల్లదొరలు నరసింహారెడ్డిని కోవెలకుంట్లలో బహిరంగంగా ఉరితీసి జనాన్ని భయభ్రాంతులను చేశారన్నారు. ఆయన తలను దాదాపు 30 ఏళ్ల పాటు కోటగుమ్మానికి వేలాడదీసి ఉంచారన్నారు. ఉయ్యాలవాడ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. అనంతరం నంద్యాలకు చెందిన సీనియర్ జర్నలిస్టు కాశీపురం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సుమారు ఐదువేల మంది సైన్యంతో ఉయ్యాలవాడ తిరుగుబాటు చేశారని గుర్తు చేశారు. ఉయ్యాలవాడ వారసుడు కర్నాటి మహేంద్రనాథరెడ్డి, రెడ్డి సేవా సమితి ఆర్గనైజింగ్ సెక్రటరీ పద్మప్రియ చంద్రారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ ఫణిశేఖర్ పాల్గొన్నారు.

పులివెందులలో... పులివెందుల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ, అధ్యాపకులు, విద్యార్థులు నివాళులు అర్పించారు.

తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ: తులసిరెడ్డి



వేంపల్లెలో నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): స్వర్గీయ ఉయ్యాలవాడ నరసంహారెడ్డి దేశంలోనే తొలి స్వాతంత్ర్య సమరయోధుడని రాజ్యసభ మాజీ సభ్యుడు, ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. శనివారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు వేంపల్లెలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, రమణ, నాగరాజు, వినయ్, వేమారాజా పాల్గొన్నారు.

వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బసవరాజు

కడప(వినాయకనగర్), ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సమ్మెట బసవరాజును నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ కార్యవర్గంలో సీనియర్ నాయకుడైన బసవరాజుకు తగిన ప్రాధాన్యత కల్పించారు.

ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి

పులివెందుల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని ఆహార విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ ఎం.మాధవ, పులివెందుల ట్రాఫిక్ సీఐ హాజీవలి అన్నారు. శనివారం స్థానిక కళాశాలలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

వారు మాట్లాడుతూ ప్రమాదాలను తగ్గించడం, గాయాలను తగ్గించడం కోసం అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగు సూచనలు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటాం



మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

చక్రాయపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం దృష్ట్యా మండలంలోని గ్రామాలలో నీటిఎద్దడి రాకుండా తగు చర్యలు తీసుకుంటామని టీడీపీ మండల ఇన్‌చార్జి తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శనివారం నాగులగుట్టపల్లెలోని తన స్వగృహంలో టీడీపీ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యకర్తలందరికీ అండగా ఉంటామని, సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. టీడీపీ నాయకులు గణేష్ రెడ్డి, ఉపసర్పంచు ఆంజనేయులు, ఎద్దుల చంద్ర, బాలే రామాంజులరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సెక్టోరియల్ అధికారులుగా నియమించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్లుగా అర్హత కలిగిన, పనిచేయడానికి ఆసక్తి ఉన్న ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలను నియమించడానికి చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి. వెంకటసుబ్బారెడ్డి శుక్రవారం కడప సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయంలో అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌కు వినతిపత్రం సమర్పించారు. తర జిల్లాల్లో ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారులు సమగ్ర శిక్ష కార్యాలయంలో సెక్టోరియల్ ఆఫీసర్‌గా కొనసాగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డి. చంద్రశేఖరరావు, ట్రెజరర్ జి.వి జయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మత్తుకు బానిసై చిత్తు కావద్దు



ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు కళాజాతా బృందం

వేంపల్లె, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మత్తుకు బానిసలుగా మారి జీవితాన్ని చిత్తుచేసుకోవద్దని బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలని ఆర్కే వ్యాలీ సీఐ ఉలసయ్య, ట్రిపుల్‌ఐటీ ఏఓ రవికుమార్ సూచించారు. శనివారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. పోలీసు కళాజాతా బృందం నాటక, నృత్య ప్రదర్శన ద్వారా విద్యార్థులకు తెలియజెప్పారు. అతిథులు మాట్లాడుతూ వ్యసనాల బానిసయితే జీవితం అగమ్యగోచరమవుతుందన్నారు.

మహానాడు నిర్వహణకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి తదితరులు

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మే నెలలో నిర్వహించబోయే టీడీపీ మహానాడు- 2025 కార్యక్రమం కోసం టీడీపీ నేతలు స్థల పరిశీలన నిర్వహించారు. శనవారం కడప నగరం సబ్‌జైలు దగ్గర్లో ఉన్న ఎన్జీఓ లేఔట్స్‌లో స్థలాన్ని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి పరిశీలించారు. ఏర్పాట్లు ఎలా చేయాలో చర్చించారు. వారు మాట్లాడుతూ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా కడప జిల్లాలో మహానాడుకు టీడీపీ శ్రేణులకు గుర్తుండిపోయేలా నిర్వహించేందుకు కార్యచరణ రూపొందిస్తామన్నారు.

యూసీఐఎల్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లెలో స్వచ్ఛత ర్యాలీ

వేముల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలపల్లె గ్రామంలో యూసీఐఎల్ ఆధ్వర్యంలో స్వచ్ఛత ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర గ్రామ ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థులకు శుభ్రతపై డ్రాయింగ్, ఎస్సే రైటింగ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూసీఐఎల్ అధికారులు సుమన్‌సర్కార్, మతివనన్, శ్రీకాంత్, నవీన్‌కుమార్ రెడ్డి, కిషోర్‌భగత్, శ్రీను, మోహన్‌రెడ్డి, భద్రదాస్, రవిశంకర్, గంగిరెడ్డి, తమిళనాడుకు చెందిన అన్నా యూనివర్సిటీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, యూసీఐఎల్ తుమ్మలపల్లె అధికారులు, ఉద్యోగులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాతో ఉద్యోగావకాశాలు



ఉద్యోగావకాశాలను పొందిన వారితో సిబ్బంది

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జాబ్‌మేళాతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో సుబ్రోస్ లిమిటెడ్ క్యాంపస్ ప్లేస్‌మెంటు డ్రైవ్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ప్రముఖ థర్మల్ ప్రొడక్ట్స్ కంపెనీ అయిన సుబ్రోస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్, కమలాపురంలో విజయవంతంగా డ్రైవ్ నిర్వహించామన్నారు. 1985 నుంచి సుబ్రోస్ వివిధ పరిశ్రమలకు పూర్తిస్థాయి థర్మల్ సిస్టమ్ పరిష్కారాలను ఉత్పత్తి చేస్తుందన్నారు. నిరుద్యోగ యువత ఎక్కడ జాబ్ మేళా నిర్వహించిన పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందేందుకు వినియోగించుకోవాలన్నారు.

సర్వే పక్కాగా చేపట్టాలి

సికెదిన్నె, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో పి 4 సర్వే పక్కాగా చేపట్టాలని ఎంపీడీవో కుళాయిబాబు సూచించారు. చింతకొమ్మదిన్నె మండలం నాగిరెడ్డిపల్లెలో జరుగుతున్న పి4 సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే ద్వారా ప్రజల సమాచారం, వారి స్థితిగతులు, సమస్యలు తెలుసుకుని వారికి పథకాలపై సమగ్ర అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆవుల స్వామి తిరునాళ్లు

లింగాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అంబకపల్లె గ్రామంలో వెలసన ఆవులస్వామి తిరుణాల ఆదివారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి సంవత్సరం శివరాత్రి పండుగ రోజు ముందు వచ్చే ఆదివారం నాడు తిరుణాళ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులకు ఆరాధ్యదైవం మహిమాన్వితుడు ఆవులస్వామి. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తిరుణాలలో పాల్గొని ఆవులస్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు భోజన ఏర్పా ట్లు చేశారు. రాత్రికి పంచరత్నాలు నాటక ప్రదర్శన ఉంటుంది.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు ఆదర్శనీయం

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా దేశంలో విద్యా సంస్కరణల్లో మార్పులు తెచ్చిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం అజాద్ అని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్ కొనియాడారు. శనివారం కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం అజాద్ 67వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

సైబర్ మోసాల పట్ల అవగాహన అవసరం



సైబర్ మోసాల పట్ల అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

వల్లూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాల పట్ల అవగాహన అవసరమని కళాజాతా బృందం వారు తెలిపారు. శనివారం పుష్పగిరి గ్రామంలో భారతీయ రిజర్వు బ్యాంకు వారి సహకారంతో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సైబర్ మోసాల పట్ల అవగాహన కార్యక్రమాన్ని రూరల్ మీడియా కళాబృందం జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీల పట్ల ప్రతి ఒక్కరూ అవాహన పెంచుకోవాలనే ఉద్దేశ్యం, అలాగే ఆర్థిక నేరాలపైప్రజలకు అవగహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఈ కళాజాత కేంద్రం వారు కళాజాత ద్వారా ప్రతిఒక్కరినీ సైబర్ మోసాల పట్ల అవగాహన ఎలా పెంపొందించాలన్న దాని పట్ల ప్రదర్శనగావించారు. ముందుగా సైబర్ నేరాల పట్ల బ్యాంకు సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ఏమైనా జరిగితే 1930 టోల్‌ఫ్రీ నెంబరుకు కానీ, స్థానిక సైబర్ క్రైం పోలీసులకు కానీ ఫిర్యాదు చేయాలన్నారు. అపరిచిత ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.ఎవరైనా ఫోను చేసి ఓటీపీలు చెప్పమని అడిగితే తెలపకూడదన్నారు. వాట్సప్ లింకులు సైబర్ నేరాలకు వీలుగా ఉంటాయని, వాటి పట్ల ప్రజలు అవాహనతో ఉండాలన్నారు. డిజిటల్ లావాదేవీలు, ఏటీఎంపై నెంబర్లు, ఓటీపీనెంబర్లు పిన్ నెంబర్లు ఎవరికీ తెలపకూడదన్నారు. హెడ్ సంస్థ అధ్యక్షుడు క్రిష్ణయ్యయాదవ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృంగా తీసుకుపోవాలన్నారు. అనంతరం కళాజాతా బృందం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

పర్యవేక్షణతోనే 'పది'పై పట్టు

- ప్రణాళికా బద్ధంగా చదివితే ఉత్తమ మార్కులు
- విద్యార్థులు వ్యాపకాలకు దూరంగా ఉండాలంటున్న ఉపాధ్యాయులు



వైవీఎస్ మునిసిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేది విద్య. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. పదో తరగతిలో విద్యార్థులు కష్టపడికాకుండా ఇష్టపడి చదవాలని నిపుణులు పేర్కొంటున్నారు. అంతేగాక చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా జాగ్రత్త వహించాలని సూచించారు. మొదటిసారిగా పబ్లిక్ పరీక్షలు రాస్తుండడంతో విద్యార్థులు భావోద్వేగానికి గురి కాకుండా ఉండాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి పాఠశాలలో విద్యార్థుల కోసం డిసెంబరు నుంచి స్టడీ అవర్స్ నిర్వహిస్తూ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడంపై విద్యార్థులతోపాటు తల్లిదండ్రులలోనూ ఆందోళన వ్యక్తమవుతోంది. మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు జరుగనున్నాయి. విద్యార్థులకు మూడు వారాల సమయం ఉంది. ప్రొద్దుటూరు మండలంలో దాదాపు 3,615 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షల కోసం సిద్ధమవుతున్నారు. ఉత్తమ ఫలితాల కోసం విద్యార్థులు రాత్రి, పగలు కష్టపడి చదువుతున్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తమ ప్రతిభను చాటుకోవడానికి ఆరాటపడుతున్నారు. కేవలం పాఠశాలలో ఉపాధ్యాయులే కాకుండా ఇళ్ల వద్ద కూడా విద్యార్థులపట్ల తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని వారి ఆరోగ్యం దెబ్బతినకుండా కనిపెట్టుకుని ఉండాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. పగలు, రాత్రి చదువుపైనే ధ్యాసపెట్టడంతో నీరసానికి గురికాకుండా సమయానికి తగిన ఆహారం, పండ్ల రసాలు అందించాలని సూచిస్తున్నారు. టీవీలు,సినిమాలకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సెల్‌ఫోన్లకు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని సూచిస్తున్నారు.

తల్లిదండ్రులు పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలి



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు పదోతరగతి చదువుతున్న తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని పోట్లదుర్తి జడ్పీహైస్కూల్ హెచ్ఎం పద్మనాభరాజు కోరారు. శనివారం ప్రీఫైనల్ పూర్తయిన పది విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీ, డీ స్థాయి విద్యార్థులపై చర్చించారు. ఇప్పటి వరకు విద్యార్థులను తాము పూర్తిస్థాయిలో చదివించామని, ఇకపై ముఖ్యంగా చదువులో వెనకబడిన విద్యార్థులపై తల్లిదండ్రులు మరింత శ్రద్ధపెట్టి చదివిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీక్రిష్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి



విద్యార్థులు టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి. వేరే ఆలోచనలు పక్కనపడవేసి ఇప్పటి నుంచైనా బాగా చదివితే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించవచ్చు. కష్టంగా ఉన్న సబ్జెక్టులకు కొంచెం సమయం ఎక్కువ కేటాయించి చదువుకోవాలి.

నాగార్జునరెడ్డి, హెడ్మాస్టర్,
వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలు

● ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి



పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలనే తపనతో ప్రణాళికాబద్ధంగా చదవాలి. పాత ప్రశ్నపత్రాలను ఒకసారి చదువుకోవాలి. ఏకాగ్రతతో చదివితే మంచి మార్కులు సాధించవచ్చు. ఏవైనా సందేహాలు ఉంటే ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలి.

గంగాధర్‌నాయుడు, తెలుగు ఉపాధ్యాయుడు,
వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలు

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న డీఎల్ యువసేన సభ్యులు

ఖాజీపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ములపాకు సమీపాన ఉన్న పునీతలారెన్స్ వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. శనివారం మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి 52వ పెళ్లిరోజు సందర్భంగా తిప్పిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన డీఎల్ యువసేనా సభ్యులు కోటయ్య, గురుమోహన్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అంతేకాక మైదుకూరు బస్టాండులో ఉదయం టిఫిన్, వాటర్ బాటిళ్లను అందజేశారు.

కాశీవిశ్వనాథ ఆలయంలో ప్రత్యేక పూజలు



వారణాశిలోని కాశీవిశ్వనాథ ఆలయం సందర్శించిన టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, కూటమి నాయకులు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి శనివారం వారణాశిలోని ప్రసిద్ధ కాశీ విశ్వనాథ ఆలయం సందర్శించారు. అక్కడ శివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆలయానికి సమీపాన కుంభమేళాలో పాల్గొని స్నానాలు చేసి పూజలు చేసి మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో భూపేశ్‌రెడ్డి అభిమానులు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

బిందు సేద్య పరికరాల పై అవగాహన

ముద్దనూరు ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి):స్థానిక రైతు సేవా కేంద్రంలో శనివారం ఉద్యాన శాఖ డివిజన్ పరిధిలోని ఉద్యాన, వ్యవసాయ సహాయకులకు బిందు సేద్యం పరికరాల అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు.అందులో భాగంగా ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వర్లరెడ్డి మాట్లాడుతూ ఉద్యాన పంటలకే కాకుండా మొక్కజొన్న, పత్తి రకాల వ్యవసాయ పంటలకు బిందు సేద్యం పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి మల్లేశ్వరరెడ్డి, మైక్రో ఇరిగేషన్ ఏరియా అధికారి, యేసునాథరెడ్డి, ఏఈ శ్రీనివాసులు, డివిజన్ పరిధిలోని ముద్దనూరు, కొండాపురం, సింహాద్రిపురం, తొండూరు ఉద్యాన, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి నుంచి వ్యర్థాలు సేకరించాలి

ఖాజీపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి నుంచి ఉదయాన్నే వ్యర్థాలను సేకరించాలని పంచాయతీ సిబ్బందికి జిల్లా పంచాయతీ పరిపాలనాధికారి రాజ్యలక్ష్మి సూచించారు. శనివారం మండల పరిధిలోని ఖాజీపేట మేజర్ పంచాయతీ భూమాయపల్లె పంచాయతీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొంగాని వెంకటసుబ్బయ్య, మండల రీసోర్స్ పర్సన్ దేవేందర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా గ్రూపు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు కోర్టు పరిధిలో కక్షిదారులు వివిధ కేసులకు సంబంధించి రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి భార్గవి సూచించారు. శనివారం జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఆవరణలో జడ్జి అధ్యక్షతన పోలీసు అధికారులు, న్యాయవాదులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ 8వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ గురించి వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, సెక్రటరీ మురళీధర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు సుబ్బారెడ్డి, మునిసుబ్బారెడ్డి, సీఐలు లింగప్ప, గోపాల్‌రెడ్డి, దస్తగిరి, ఎస్ఐలు శ్యాంసుందర్‌రెడ్డి, రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో రాయలసీమకు నిధులు కేటాయించాలి

సీమ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ ధర్నా



ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బడ్జెట్ సమావేశంలో రాయలసీమకు 42 శాతం నిధులు కేటాయించి పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని రాయలసీమ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ ఎస్వీమహమూద్ డిమాండ్ చేశారు. శనివారం రాయలసీమ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాయలసీమకు నిధులు కేటాయింపు కోరుతూ తహసీల్దారు కార్యాలయం వద్ద ర్యాలీ ధర్నా చేపట్టారు. అనంతరం డిప్యూటి తహసీల్దారు సాయినాధ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో విరసం కార్యవర్గ సభ్యురాలు పివరలక్ష్మి, చైతన్య మహిళా సంఘం కన్వీనర్ పద్మ, లెక్చరర్ శ్రీనివాసులు, మహిళా శక్తి కన్వీనర్ లక్ష్మీదేవి, విద్యార్థి శక్తి కన్వీనర్ హరిత, ప్రగతిశీల కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, జిల్లా కార్యదర్శి నాగేంద్ర, పెన్షనర్స్ అసోసియేషన్ సంజీవరెడ్డి, భరత్‌రెడ్డి, ఐహెచ్‌ఆర్‌సీ జాయింట్ సెక్రటరీ మేకల వెంకటన్న, మాల మహాసేన గూడెం చెరువు సంపత్, జిల్లా అధ్యక్షుడు భాస్కర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ సీఎంగా రేఖాగుప్త ఎన్నిక కావడం ఆనందదాయకం



విజయోత్సవం జరుపుకుంటున్న బీజేపీనాయకులు, ఆర్యవైశ్యులు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరపున గెలిచి రేఖాగుప్త ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పోరుమామిళ్లలో బీజేపీ నాయకులు, ఆర్యవైశ్యులతో కలిసి విజయోత్సవ వేడుకలు జరిపి స్వీట్లను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమణాచారి, మండల అధ్యక్షుడు నాగేంద్ర, పల్లెంశెట్టిపండరి, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతశిఖరాలకు చేరుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి పేర్కొన్నారు. శనివారం ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలులో 220 మంది పదో తరగతి విద్యార్థులకు గౌతమ్ హైస్కూలు కరస్పాండెంట్ టి.సుధీర్ సహకారంతో పరీక్ష సామగ్రిని ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ నాగార్జునరెడ్డి, ఉపాధ్యాయులు, ప్రాణదాత సేవా సమితి సభ్యులు సునీల్, దివిజేంద్రనాథరాజు, పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి వార్షికోత్సవం



ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల-ముద్దనూరు రోడ్డులోని వెలసిన శ్రీచౌడేశ్వరీదేవి ఆలయం 37వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

సేంద్రియ ఎరువులను అలవాటు చేయండి

మైదుకూరు రూరల్ ,ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం అలవరుచుకోవాలని అలాగే సేంద్రియ ఎరువులను తయారు చేసుకొని వాడాలని అటారీ జోన్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా పేర్కొన్నారు.మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం ఎనిమిదో శాస్త్రీయ సలహా సంఘం సమావేశం జరిగింది.అనంతరం రైతులకు పనిముట్లు ఉచితంగా అందించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు గోవిందరాజులు,వీరయ్య, బాలక్రిష్ణ, శ్రీవిద్యారాణి,ఫిరోజ్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ప్రగతి సాధ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ప్రగతి సాధ్యమని విద్యార్థులు గుర్తించుకోవాలని టుటౌన్ సీఐ యుగంధర్ పేర్కొన్నారు. శనివారం శ్రీనివాసనగర్ మున్సిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల వార్షికోత్సవ వేడుకలను శ్రీనివాసనగర్ ఆటోస్టాండ్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సినీనటుడు దావూద్, కౌన్సిలర్లు జిలానీబాష, మన్నేసత్యం, హెడ్మాస్టర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి శవమయ్యాడు

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలంలోని చిలమకూరులో అదృశ్యమైన కమ్మం శివరామిరెడ్డి(58) శవమయ్యాడు. కాగా ఈనెల 15న అదృశ్యంపై ఎర్రగుంట్ల పోలీసు స్టేషన్‌లో కేసునమోదు అయ్యింది. కాగా మృతదేహం మల్లేల ఘాట్ రోడ్డులో కనిపించింది. మృతదేహం గుర్తుపట్టలేనివిధంగా కుళ్లిపోయింది. శనివారం జమ్మల మడుగు డీయస్పీ వేంకటేశ్వర్లు, ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు ఆధ్వర్యంలో మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిర్వహించారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

మైలవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎంపీడీవో రామచంద్రారెడ్డి, ఎంపీపీ సావిత్రి ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమంలో తహసీల్దారు నారాయణ, ఎంఈవో చిట్టిబాబు, ఏవో విజయారావు, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల అధికారులు పాల్గొన్నారు.

ఆటోబోల్తా..పలువురికి గాయాలు

ఖాజీపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తనెల్లూరు సమీపాన ఆటోబోల్తాపడి పలువురికి గాయాలు అయ్యాయి. చెన్నూరుకు చెందిన మహిళలు కొత్తనెల్లూరు వద్దకు పొలంపనులకు వెళ్లి తిరిగి వెళుతుండగా ఆటో బోల్తాపడడంతో నాగమ్మ, పద్మావతి, శివమ్మ, రామలక్షుమ్మకు గాయాలు అయ్యాయి. ఆటోలో దాదాపు 20 మంది ఉన్నట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వారిని చెన్నూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం 108 ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. సీఐ మోహన్‌ను 'ఆంధ్రజ్యోతి' అడుగగా తమకు ఎటువంటి సమాచారం లేదని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

గ్రామసభ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి : ఆర్డీవో

బి.కోడూరు ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలు గ్రామసభలు, గ్రీవెన్స్‌సెల్‌లో ఇచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఆర్డీవో చంద్రమోహన్ పేర్కొన్నారు. శనివారం బి.కోడూరు తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేశారు.కార్యక్రమంలో తహసీల్దారు దస్తగిరయ్య, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు మధునాయక్, మండల సర్వేయరు రక్షిత, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టరు నిజాయితీ

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప - బద్వేలు అద్దె బస్సులో లింగాలకుంటకు చెందిన మహిళ పర్సు మరిచిపోయి దిగినప్పటికీ బస్సు కండక్టరు కేవీ రమణ అధికారుల ద్వారా ఆమె కుమారుడికి అప్పజెప్పి నిజాయితీ చాటుకున్నట్లు డిపో మేనేజరు నిరంజన్ తెలిపారు. శనివారం కడప నుంచి బద్వేలుకు వచ్చే సమయంలో లింగాలకుంటకు చెందిన మహిళ బస్సులోనే పర్సు మరిచిపోయి స్టేజీ వద్ద దిగిపోయింది. ఇంటికి వెళ్లిన తరువాత కుమారుడు అజిత్‌కుమార్‌రెడ్డికి విషయం తెలపగా ఆర్టీసీ బస్టాండుకు వచ్చి విచారణ చేశాడు. కండక్టరు కేవీ రమణ డీఎం నిరంజన్‌కు ఫోను ద్వారా సమాచారం తెలిపి పర్సును ఆమె కుమారుడికి అప్పజెప్పారు. పర్సులో రెండు జతల బంగారు కమ్మలు ఉన్న విషయాన్ని గుర్తించారు. దీంతో నిజాయితీగా పర్సు అప్పజెప్పిన కండక్టరు కేవీ రమణను డీఎం ఇతర ఉద్యోగులు అభినందించారు.

ద్విచక్రవాహన దొంగలు అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ఇద్దరు బైకుల దొంగలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐ రామకృష్ణ దేవగుడి క్రాస్‌రోడ్డు వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా మోటారు సైకిళ్ల దొంగ అయిన మిద్దె రాముడు, జమ్మలమడుగు మండలం గొరిగెనూరు గ్రామం. అదేగ్రామానికి చెందిన పోరెడ్డి నాగేశ్వరరెడ్డి అనే ఇద్దరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి విలువ దాదాపు రూ.2.50 లక్షలు అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుళ్లు దేవదాసు, రియాజ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజుకు చేరిన సీపీఐ కాలనీవాసుల రిలేదీక్షలు



బద్వేలు రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పేదలపై అధికారులు కక్ష సాధింపు చర్యలు మానుకుని వారు నివాసం ఉన్న చోటనే ఇంటి పట్టాలు, పక్కాగృహాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు పడిగె వెంకటరమణ, రూరల్ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానుయేలు డిమాండ్ చేశారు. భాకరాపేట సమీపంలో సీపీఐ కాలనీవాసులు చేపట్టిన రిలే దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో వెంకటేశ్, రాజశేఖర్, బ్రహ్మయ్య అంకమ్మ మరో 34 మంది దీక్షల్లో పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్య నారాయణ డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ నాయకులు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చంటి కార్యదర్శి సాల్మన్, కోశాధికారి రాఘవ, జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, గుర్రమ్మ ప్రమీల, రమాదేవి పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

బద్వేలు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల,ఉద్యోగ భద్రతకు పాలకవర్గ సమావేశంలో తీర్మానం చేయాలని కోరుతూ శనివారం సీఐటీయూఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకట సాయిక్రిష్ణకు సీఐటీయూ ఆధ్వర్యంలో యూనియన్ జిల్లాఅధ్యక్షుడు నాగేంద్రబాబు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పట్టణ అధ్యక్షుడు పులి శ్యామ్ ప్రవీణ్,దియ్యాల హరి, సత్యరాజు,శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళులు



ప్రొద్దుటూరులో నివాళులర్పిస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో శనివారం స్వాతంత్ర్య యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, రాఘవేంద్ర, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని శనివారం ఆయన విగ్రహానికి రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ స్వరూప్‌కుమార్‌రెడ్డి , టీటీడీ మాజీ సభ్యుడు మారుతీప్రసాద్, కోటా ఓబుళరెడ్డి, రామచంద్రారెడ్డి, పద్మవీరన్న, రమణయ్య, రామాంజనేయరెడ్డి, దస్తగిరి, డాక్టర్ నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.